ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 113, పేజీలు - 08
శనివారం,అక్టోబర్ 24, 2026 వెల: 5 రూ/.




హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## 'వికసిత్ భారత్ 2047' కోసం స్వయం సమృద్ధి అవసరం

**- విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలన్న ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలని, ఆత్మనిర్భరత వైపు పౌరులను ప్రేరేపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో తలెత్తుతున్న రుగ్మతలు, కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి

2లో..

# గాలి కాదు... గరళం!

▶ హైదరాబాద్‌లో జాతీయ పరిమితికి మించి 33.3% కాలుష్యం! ▶ సంగారెడ్డిలో 30 శాతం.. నల్గొండలో 18.3 శాతం అధికం
▶ పీఎం-10 వార్షిక సగటు 80 మైక్రోగ్రాములకు చేరిక ▶ డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాలతో పోలిస్తే ఐదు రెట్లకు పైగా కాలుష్యం
▶ ఊపిరితిత్తులు, గుండెకు ముప్పు.. పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రాణవాయువు పీల్చాల్సిన చోట విషపూరిత గాలిని పీలుస్తున్నామా? నగరాల్లో పెరుగుతున్న వాయు కాలుష్యం ప్రజారోగ్యానికి పెను సవాలుగా మారుతోంది. వాహనాల నుంచి వెలువడే పొగ, పరిశ్రమల ఉద్గారాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి, నిర్మాణ కార్యకలాపాలు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు నగరాల్లో గాలిలో సూక్ష్మ ధూళి కణాల స్థాయిలు జాతీయ ప్రమాణాలను మించి నమోదవుతున్నాయి. 2025-26 వార్షిక సగటు గణాంకాలు ఈ పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో పీఎం-10 స్థాయి జాతీయ పరిమితి కంటే 33.3 శాతం అధికంగా నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.

### మూడు నగరాల్లోనూ ప్రమాణాలకు మించి

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పీఎం-10 వార్షిక సగటు క్యూబిక్ మీటరు గాలిలో 60 మైక్రోగ్రాములకు మించకూడదు. అయితే 2025--26 గణాంకాల ప్రకారం హైదరాబాద్‌లో ఈ స్థాయి 80 మైక్రోగ్రాములకు చేరింది. సంగారెడ్డిలో 78, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదైంది. అంటే హైదరాబాద్‌లో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం, సంగారెడ్డిలో 30 శాతం, నల్గొండలో 18.3 శాతం అధికంగా కాలుష్యం నమోదైంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యలు కొనసాగుతున్నప్పటికీ, ఈ నగరాల్లో గాలి నాణ్యత మెరుగుపడాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

2లో..

# కూటమిలో సీట్ల సర్దుపాట్లు

- చంద్రబాబు నివాసంలో జరిగిన సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో చర్చలు
- రెబల్స్ సమస్యను పరిష్కరించి, సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్ణయం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** స్థానిక ఎన్నికల వేళ రాష్ట్రంలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి- వైసీపీ మధ్య ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. వైసీపీ నామినేషన్ల వేళ చోటు చేసుకున్న ఘటన లపై సుప్రీంను ఆశ్రయించింది. సుప్రీం ఆదేశాలు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కాగా జెడ్పీటీసీ ఎన్నికలు కీలకంగా మారుతున్నాయి. ఈ పరిణామాల క్రమంలో సీఎం చంద్రబాబు తో డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాజా పరిణామాల పై చర్చించారు. కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల వేళ రాజకీయం ఒక్క సారిగా కొత్త మలుపు తీసుకుంది. ఘర్షణలు కాల్పులు కేసుల వరకు వెళ్లింది. అటు మాజీ సీఎం జగన్ ప్రభుత్వం పైన మండిపడుతున్నారు. సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. మున్సిపల్ ఎన్నికలను రీ షెడ్యూల్ చేసారు. జెడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్లకు చివరి రోజు కావడంతో, ఇక తాజా పరిణామాల పైన సీఎం చంద్రబాబు, పవన్ చర్చించారు. రెండో రోజు వరుసగా చంద్రబాబు ఇంటికి వచ్చిన పవన్ రాష్ట్రంలో చోటు చేసుకున్న పరిణామాలతో పాటుగా జెడ్పీ ఛైర్మన్ సీట్ల పంపకాల పైన చర్చ చేసినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో ఎనిమిది జెడ్పీ స్థానాలను జనసేన కోరినట్లు సమాచారం.

2లో..

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**- నామినేషన్ కేంద్రాల్లో వైసీపీ అభ్యర్థులపై దాడులు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో రావణకాసుర పాలన నడుస్తోందని ఆయన మండిపడ్డారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేసి, వారి నామినేషన్ పత్రాలను చించివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

2లో..

## కురవని వానలు..
# పెరగనున్న కష్టాలు.?

- అక్టోబర్ నెలలో ముఖం చాటేసిన వరుణుడు - ఏకంగా 95 శాతం లోటు వర్షపాతం నమోదు
- సమ్మర్‌లో పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళనలో ప్రజలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఈసారి లోటు వర్షపాతం నమోదైన సంగతి తెలిసిందే. అక్టోబర్ నెలలో రాష్ట్రంలో ఇప్పటి వరకూ ఏకంగా 95 శాతం లోటు వర్షపాతం నమోదైంది. సాధారణంగా అక్టోబర్ నెల తొలి మూడు వారాల్లో రాష్ట్రంలో 75.6 మి.మీ. వర్షం కురుస్తుంది. కానీ ఈసారి కేవలం 5.3 మిల్లీమీటర్ల వర్షమే కురిసింది. దీని ప్రభావం పంటలపై, భూగర్భ జలాలపై పడే అవకాశం ఉంది. భారత వాతావరణ విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్షపాతం లోటు సమస్య తీవ్రమవుతోంది. అక్టోబర్ 1వ తేదీ నుంచి 21వ తేదీ మధ్య 12 జిల్లాల్లో అసలు వర్షమే కురవలేదు. మిగతా 21 జిల్లాల్లోనూ భారీ లోటు నమోదైంది.హైదరాబాద్ నగరంలో అక్టోబర్ నెలలో మామూలుగానైతే 114 మి.మీ. వర్షం కురుస్తుందని 1991-2020 మధ్య సగటు వర్షపాత గణాంకాలు చెబుతున్నాయి. 2020లోనైతే అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో భారీ వరదలు కూడా వచ్చాయి.

2లో..

## సైబర్ నేరాల నియంత్రణలో
# తెలంగాణ టాప్

**- సురక్షితమైన దక్షిణ భారతదేశాన్ని నిర్మిద్దామన్న సీఎం రేవంత్**

- దక్షిణాది రాష్ట్రాల పోలీసుల మధ్య సమన్వయాన్ని పెంచాలని పిలుపు
- పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానం, ఐసీసీసీ వ్యవస్థలను పంచుకుంటామని వెల్లడి
- హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా పునర్వ్యవస్థీకరించినట్లు ప్రకటన
- నేరాల నియంత్రణకు హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాల ఏర్పాటు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సమాజానికి భద్రతే పునాది అని, సమర్థవంతమైన, నైతిక విలువలతో కూడిన పోలీసింగ్‌ను ప్రజలు కోరుకుంటున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నేరాల స్వరూపం వేగంగా మారుతున్న ప్రస్తుత కాలంలో నిరంతర సంస్కరణలు అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ కమిటీ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన డీజీపీలు, దక్షిణాది రాష్ట్రాల సీనియర్ పోలీసు అధికారులు, వివిధ కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రతినిధులకు ఆయన స్వాగతం పలికారు. ఈ సదస్సు హైదరాబాద్‌లో

2లో..

## తెలుగు రాష్ట్రాల్లో 15 చోట్ల
# ఈడీ మెరుపు దాడులు

**- ఆన్‌లైన్ బెట్టింగ్, హవాలా గ్యాంగ్‌లపై ఫోకస్**




హైదరాబాద్ / అమరావతి (ప్రశ్న న్యూస్) తెలుగు రాష్ట్రాల్లో మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ మెరుపు దాడులు కలకలం రేపుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 15 ప్రాంతాల్లో అధికారులు ఒకేసారి తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, మోసపూరిత ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల ద్వారా సామాన్యులను మోసం చేస్తున్న అంతరాష్ట్ర ముఠాలపై ఈడీ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా పలు ప్రాంతాల్లో దాడులకు దిగినట్టు వార్తలు వస్తున్నాయి.

2లో..

## దేశ రాజకీయాల్లో
## కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి



- రేవంత్ రెడ్డి పాలన తాత్కాలికం
- త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని ధీమా
- కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు
- ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక పాత్ర పోషించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, ఆయన జాతీయ స్థాయిలో చక్రం తిప్పే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ హడావిడి కొద్దిరోజులు

2లో..

## ప్రజల భాగస్వామ్యం లేకుండా
# కరవును ఎదుర్కోలేం

**- ఎల్‌నినో పై సీఎం రేవంత్ సూచనలు**

- 8 నెలలు తీవ్ర పరిస్థితులు, రాబోయేది గడ్డుకాలం - ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
- ఎండాకాలం పంటకాలు నీళ్లు ఇవ్వడం అసాధ్యం - బీఆర్ఎస్ ప్రచారాన్ని నమ్మొద్దన్నా సీఎం రేవంత్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్, రానున్న కరువు భయాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రైతులు సాగు విషయంలో అలర్ట్‌గా ఉండాలని సూచించారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేత హరీష్‌రావు మాటలు నమ్మి పంటలు వేస్తే నష్టపోయే ప్రమాదం ఉందని తీవ్ర హెచ్చరికలు చేశారు. హరీష్‌రావును నమ్మితే మట్టితో అంబలి చేసుకోవాల్సి వస్తుంది అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రజాభవన్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యత, విద్యుత్ వినియోగం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఎం మాట్లాడారు.రాష్ట్రంలో రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితులు మరింత కఠినంగా మారే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై ఉందని ఇతర ప్రాంతాల్లోనూ నీటి కొరత సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలోనూ కరువు ప్రభావాన్ని తక్కువగా



అంచనా వేయకూడదని రాబోయే 8 నుంచి 10 నెలలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. కరువు అనేది ప్రకృతి విపత్తు అని దాని ప్రభావాన్ని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా ముందస్తు చర్యలతో నష్టాన్ని తగ్గించవచ్చని వివరించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను

2లో..



# గాలి కాదు.. గరళం!

## ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలకంటే ఐదు రెట్లు ఎక్కువ!

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచించిన పీఎం-10 వార్షిక మార్గదర్శక స్థాయి క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు. ఈ ప్రమాణంతో పోలిస్తే హైదరాబాద్‌లో నమోదైన 80 మైక్రోగ్రాములు 5.3 రెట్లు అధికం. సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు అంటే 5.2 రెట్లు, నల్గొండలో 71 మైక్రోగ్రాములు అంటే 4.7 రెట్లు ఎక్కువ. ఈ గణాంకాలు నగరాల్లో గాలి నాణ్యత మెరుగుదలకు మరింత సమర్థవంతమైన చర్యలు అవసరమని సూచిస్తున్నాయి.

### కనిపించని శత్రువు.. ఆరోగ్యంపై దెబ్బ!

గాలిలోని సూక్ష్మ ధూళి కణాలు శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించి ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయి. కాలుష్యానికి దీర్ఘకాలం గురికావడం వల్ల శ్వాసకోశ సమస్యలు తీవ్రమవడంతో పాటు గుండె సంబంధిత వ్యాధుల ముప్పు పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా బాధితులు, ఇప్పటికే ఊపిరితిత్తులు లేదా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు అధిక ప్రమాదంలో ఉంటారు. కాలుష్య ప్రభావం వెంటనే కనిపించకపోయినా, దీర్ఘకాలంలో ఆరోగ్యంపై తీవ్ర పరిణామాలు కలిగించవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### వాహనాల పొగ నుంచి నిర్మాణ ధూళి వరకు

నగరాల్లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, రహదారులపై పేరుకుపోయే ధూళి, నిర్మాణ ప్రాంతాల్లో సరైన నియంత్రణ చర్యలు లేకపోవడం, పరిశ్రమల ఉద్గారాలు వాయు కాలుష్యానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. రోడ్లను శుభ్రపరచడం, నిర్మాణ ప్రదేశాల్లో దుమ్ము వ్యాప్తిని అరికట్టడం, వాహనాల ఉద్గారాలను నియంత్రించడం, పరిశ్రమల కాలుష్యంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### గణాంకాలకే పరిమితం కాకుండా కార్యాచరణ ఏది.?

2019లో ప్రారంభమైన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం లక్ష్యం నగరాల్లో కాలుష్యాన్ని తగ్గించి గాలి నాణ్యతను మెరుగుపరచడం. అయితే హైదరాబాద్‌లో పీఎం-10 స్థాయి ఇంకా జాతీయ ప్రమాణాలను గణనీయంగా మించి ఉండటం, సంగారెడ్డి, నల్గొండల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగడం కాలుష్య నియంత్రణ చర్యల అమలుపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. కాలుష్య స్థాయిలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, వాటికి కారణమవుతున్న వనరులపై లక్ష్యిత చర్యలు చేపట్టాలి. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించేందుకు ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, పరిశ్రమలు సమన్వయంతో పనిచేయాలి. అభివృద్ధి ఎంత ముఖ్యమో, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని ఈ గణాంకాలు గుర్తుచేస్తున్నాయి.

# 'వికసిత్ భారత్ 2047' కోసం స్వయం సమృద్ధి అవసరం

25 వరకు జరగనున్న చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక ఆలోచనా విధానమని కొనియాడారు. భారత్ సంస్కృతికి జన్మస్థలమని, దేశ ఉనికికి పునాది అని ప్రధానమంత్రి అన్నారు. వ్యక్తిగత పురోగతి అనేది జాతీయ అభివృద్ధికి ఒక సాధనంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వామి చిన్మయానంద బోధనలను, ఆధ్యాత్మిక వృద్ధిని దేశాభివృద్ధికి అనుసంధానించేందుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అనే వేద మంత్రాన్ని చెబుతూ, దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా మార్చేందుకు ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.
భారతీయుల్లో తమ దేశం పట్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే స్వామి చిన్మయానంద లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. "ఈ దేశమే మన ఉనికికి పునాది. మన ఆధ్యాత్మిక పురోగతిని వ్యక్తిగత వికాసంతో అనుసంధానించాలని, దానిని దేశాభివృద్ధికి ఒక సాధనంగా మార్చుకోవాలని స్వామీజీ మనకు బోధించారు. భారతీయుల్లో దేశం పట్ల ఆత్మగౌరవాన్ని నింపడమే ఆయన లక్ష్యం. ఇదే ఉద్దేశంతో ఆయన 'గీతా జ్ఞాన యజ్ఞాన్ని' ప్రారంభించి, ఉపనిషత్తులు, వేదాంతం మన ఇతర శాస్త్రాల జ్ఞానాన్ని సామాన్య ప్రజల వరకు చేరవేశారు. ఆయన తీసుకున్న ఆ సంకల్పం ఫలితాలను ఇప్పుడు మనం చూడవచ్చు" అని ప్రధానమంత్రి మోదీ అన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

ఈ అక్రమాలపై తాము ఆధారాలు సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ), గవర్నర్‌తో పాటు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని తెలిపారు. తమ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్ల దాఖలుకు స్వేచ్ఛ కల్పించాలని, అభ్యర్థులకు రక్షణ, సీసీటీవీ రికార్డింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని జగన్ గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 19 మున్సిపాలిటీలలో తమ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కానీ ఎస్ఈసీ కేవలం పరిమిత సంఖ్యలో కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని జగన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకపక్ష విజయాల కోసం చంద్రబాబు నిబంధనలు మార్చుతున్నారని, ఇది మహాభారతంలోని మాయాజూదాన్ని తలపిస్తోందని ఆయన విమర్శించారు.

# కూటమిలో సీట్ల సర్దుపాట్లు

28 జెడ్పీ సీట్లలో 8 సీట్లు ఇవ్వాలంటూ ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో కేవలం నాలుగు మేయర్ పదవులకే సరిపెట్టుకోవడంతో పాటు పలు చోట్ల కార్పొరేటర్లు, వార్డు సభ్యుల విషయంలో తగిన వాటా దక్కలేదని జనసేన కింది స్థాయి నేతలు అసంతృప్తితో ఉన్నారు.

### జెడ్పీ స్థానాలపై కూటమి కసరత్తు

ఈ కారణంగానే పలు చోట్ల రెబల్స్ బరిలోకి దిగారు. దీంతో ఈసారి తమకు తగినన్ని స్థానాలు దక్కేలా పవన్ కల్యాణ్ చంద్రబాబుతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికల్లో రెబెల్స్ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంపైనా చర్చ జరిగినట్లు సమాచారం. అదే విధంగా బీజేపీకి సీట్ల కేటాయింపు పైన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తో చంద్రబాబు చర్చలు చేస్తున్నారు. జనసేనకు దాదాపు 20శాతం మేర, బీజేపీకి 7శాతం మేర సీట్లు కేటాయింపు జరిగింది. అయితే, జెడ్పీ ఎన్నికల్లో మాత్రం ఈ ఫార్ములా వద్దని నిర్ణయించారు. జనసేన, బీజేపీ ఇద్దరికీ సీట్ల పెంపు పైన ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక పరిస్థితులు, పార్టీల బలాబలాలను బట్టి సీట్ల పంపకాల్లో మార్పులు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే మూడు పార్టీల ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల నామినేషన్లు దాఖలు చేయడంతో అధికారికంగా సీట్ల ఖరారు పైన అభ్యర్థుల్లో ఉత్కంఠ పెరుగుతోంది.

# దేశ రాజకీయాల్లో కేసీఆర్ చక్రం తిప్పే రోజులు వస్తున్నాయి

మాత్రమేనని, ఆ తర్వాత మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. తీవ్రమైన విద్యుత్ కోతల వల్ల రైతులు అల్లాడుతున్నారని, వారి కష్టాలను పట్టించుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంపై నిపుణులు పది నెలల ముందే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయిన అన్ని వర్గాల ప్రజలు ఇప్పుడు మళ్లీ బీఆర్ఎస్ వైపే చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి హడావిడి మరికొద్దిరోజులు మాత్రమే ఉంటుందని కేటీఆర్ పేర్కొన్నారు.
జాతీయ రాజకీయాల గురించి ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలే దేశంలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని కేటీఆర్ జోస్యం చెప్పారు. రాహుల్ గాంధీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆశించిన ఫలితం ఉండదని, అటు ప్రధాని మోదీ పాలనలోనూ దేశానికి చేకూరిన ప్రయోజనం ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తెలంగాణ నుంచి గెలిచిన ఎంపీలెవరూ పార్లమెంటులో గళం విప్పడం లేదని ఆయన దుయ్యబట్టారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు యువత తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాల వల్లే నేడు యువత రోడ్లపైకి వచ్చి పోరాటాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర అభివృద్ధిని విస్మరించి, కేవలం ప్రతిపక్షాలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ఆరోపించారు.

# కురవని వానలు.. పెరగనున్న కష్టాలు.?

అయితే ఈసారి హైదరాబాద్‌లో అక్టోబర్ 1-21 తేదీల మధ్య 2.8 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. ఇది 97 శాతం లోటుకు సమానం. హనుమకొండ, జయశంకర్ భూపాపల్లి, జగిత్యాల, కరీంనగర్, మేడ్చల్-మల్కాజిగిరి, మంచిర్యాల, మెదక్, నిజామాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల్లో ఈ 21 రోజుల్లో వర్షం చుక్క కూడా పడలేదు. వర్షపాతం నమోదైన మిగతా జిల్లాల్లోనూ లోటు తీవ్రంగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో 69.3 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 1.5 మి.మీ. వర్షం మాత్రమే కురిసింది. నల్గొండ జిల్లాలో సుమారు 83 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 1.3 మి.మీ. వర్షం కురిసింది. ఈ రెండు జిల్లాల్లో వర్షపాతం లోటు 98 శాతంగా ఉంది. జనగామ జిల్లాలో 74.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 1.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లాలో 83.7 మి.మీ.కుగాను 4.5 మి.మీ. వర్షం కురిసింది.వనపర్తి జిల్లాలో అత్యధికంగా 17.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 82.1 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా.. 78 శాతం లోటు నమోదైంది. ఖమ్మం జిల్లాలో 94.6 మి.మీ. వర్షపాతానికి గాను 13.8 మి.మీ. వర్షం కురిసింది. యాదాద్రి జిల్లాలో 84.6 మి.మీ. వర్షపాతానికి గాను 13 మి.మీ. వర్షం కురిసింది. నాగర్ కర్నూల్ జిల్లాలో 80 మి.మీ. వర్షం కురవడం సాధారణం కాగా.. ఇక్కడ 10.6 మి.మీ. వర్షమే కురిసింది.ఎల్‌నినో ప్రభావంతో ఎక్కువ రోజులపాటు వర్షం కురవకపోవడం వల్ల నేలలో తేమ స్థాయిలు తగ్గుతాయని రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గుతుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. అక్టోబర నెలలో నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి ఈశాన్య రుతుపవనాలు క్రమంగా అడుగుపెడతాయి. రుతువపనాలు తిరోగమించే సమయంలో రాష్ట్రంలో వర్షాలు కురుస్తుంటాయి. అక్టోబర్ నెలలో హైదరాబాద్‌లో సాధారణంగా 113.9 మి.మీ. వర్షం కురుస్తుంది. అయితే నగరంలో అక్టోబర్‌లో కురిసే వర్షపాతం ఏటా ఒకేలా ఉండదు. 2020 అక్టోబర్‌లో నగరంలో 400.7 మి.మీ. వర్షపాతం నమోదు కాగా 2016 అక్టోబర్‌లో 37.1 మి.మీ. వర్షమే కురిసింది. చివరి వారంలో భారీగా వర్షాలు కురిస్తే కానీ తెలంగాణలో వర్షపాతం లోటు కొంతలో కొంతైనా తగ్గదు.

### వర్షపాతం తగ్గడం వల్ల పరిణామాలు ఎలా.?

ఈసారి తెలంగాణలో వర్షపాతం 17 శాతం తక్కువగా నమోదైంది. హైదరాబాద్‌లో 26 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో రాష్ట్రంలో పంటలకు నీరు, విద్యుత్ సమస్య తలెత్తుతోంది. మరోవైపు ఎండల తీవ్రత కూడా పెరుగుతోంది. రబీ సీజన్లో వరి వేయొద్దని ప్రభుత్వం కోరుతోంది. పంట దిగుబడి తగ్గడంతో బియ్యంతోపాటు ఇతర ఆహార పంటల ధరలు భారీగా పెరుగుతున్నాయి. వేసవిలో తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాలు పడిపోవడంతో అక్టోబర్‌లోనూ భారీ సంఖ్యలో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్లలోనూ నీటి మట్టం వేగంగా పడిపోతోంది. దీంతో నీరు, విద్యుత్‌ను జాగ్రత్తగా వాడుకోవాలని ప్రభుత్వం పిలుపునిస్తోంది. వేసవిలో కరెంట్ కోతలు విధించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. నిత్యావసరాల ధరల పెరుగుదల, నీటి కటకట, విపరీతమైన ఎండలతో ప్రజలు సతమతం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ టాప్

జరగడం తెలంగాణకు గర్వకారణమని, రాష్ట్రాల పోలీసు విభాగాలు, ప్రత్యేక విభాగాల మధ్య మెరుగైన సమన్వయం సాధించేందుకు ఇది ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### అందుకే హైదరాబాద్ కమిషనరేట్‌ను విభజించాం

పోలీసు వ్యవస్థకు కేటాయించే నిధులను ఖర్చుగా కాకుండా సురక్షిత సమాజ నిర్మాణం కోసం చేసే పెట్టుబడిగా తాము భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాలనా సౌలభ్యం కోసం హైదరాబాద్ పోలీసు వ్యవస్థను హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే 3 కమిషనరేట్లుగా విభజించామని, దీనివల్ల పరిమిత ప్రాంతాలపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించే వీలు కలిగిందన్నారు. అలాగే సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణ, మహిళల భద్రత కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను అందుబాటులోకి తెచ్చినట్లు వివరించారు. తెలంగాణ పోలీసు శాఖ చేపట్టిన సంస్కరణలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన ప్రగతి సమీక్షలో సైబర్ నేరాల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని, అమెరికా ఎఫ్డీఏ తరహాలో ఆహార కల్తీ, ఔషధాల నియంత్రణ కోసం టీజీ-సేఫ్ విభాగాన్ని ప్రారంభించామని తెలిపారు.డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ విభాగం కేంద్రం నుంచి 80 శాతానికి పైగా మార్కులు సాధించిందని పేర్కొన్నారు. తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని, ఆక్రమణలకు గురైన చెరువులు, ప్రజా ఆస్తుల పరిరక్షణలో హైడ్రా ప్రముఖ పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. ట్రాఫిక్ నిర్వహణలో ట్రాన్స్‌జెండర్లను నియమించిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టే పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని సీఎం హామీ ఇచ్చారు.

కానిస్టేబుల్ నుంచి డీజీపీ స్థాయి అధికారుల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యనందించేందుకు 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్'ను ఏర్పాటు చేశామన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసు కుటుంబాలకు వారి హోదాను బట్టి రూ.1 కోటి నుంచి రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా, గృహ నిర్మాణ స్థలాలు, కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఏ ఒక్క రాష్ట్రం ఒంటరిగా నేరాలను అరికట్టలేదని, దక్షిణాది రాష్ట్రాలన్నీ సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థను పంచుకుంటూ కలిసికట్టుగా సురక్షితమైన దక్షిణ భారత్‌ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# తెలుగు రాష్ట్రాల్లో 15 చోట్ల ఈడీ మెరుపు దాడులు

### అసలు కేసు మూలాలు

మహారాష్ట్రలోని పుణే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీల్యాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో అధిక లాభాల కోసం సామాన్యులను ఆకర్షించి వందల కోట్ల రూపాయలు వసూలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అంతర్రాష్ట్ర ముఠాల కార్యకలాపాలను గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించే పనిలో పడ్డారు.

ఇందులో భాగంగా గత వారం ఢిల్లీ, ముంబయి, గురుగ్రామ్ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ సోదాల్లో లభించిన సమాచారం, లింకుల ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లోని ఏజెంట్లు, హవాలా ఆపరేటర్లపై తాజాగా సోదాలు చేపట్టినట్టు తెలుస్తోంది. బెట్టింగ్, మోసపూరిత యాప్‌ల ద్వారా సమీకరించిన డబ్బును షెల్ కంపెనీలు, క్రిప్టోకరెన్సీ మార్గాల ద్వారా విదేశాలకు తరలించినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది.

### సోదాల్లో దొరికిన ఆధారాలు

ఈ తనిఖీల్లో ప్రధాన అనుమానితుల ఇళ్లు, ఆఫీసుల్లో లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, బ్యాంకు పత్రాలు, డిజిటల్ పరికరాలను అధికారులు పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఈ సోదాల్లో నగదు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు, హవాలా నెట్‌వర్క్‌కు సంబంధించిన ఆధారాలు దొరికినట్టు తెలుస్తోంది.

అయితే ఏ ఏ చోట్ల తనిఖీలు చేస్తున్నారు, అక్కడ నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర ఆస్తులు లేదా డాక్యుమెంట్లకు సంబంధించి ఈడీ అధికారులు ఇంకా వెల్లడించలేదు. అంటే వారి నుంచి అధికారికంగా ఇంకా ఎటువంటి అనౌన్స్‌మెంట్ రాలేదు.

### మనీల్యాండరింగ్ నిరోధక చట్టం

అక్రమ మార్గాల్లో సంపాదించిన నల్లధనాన్ని చట్టబద్ధమైన ధనంగా మార్చడాన్ని నిరోధించేందుకు భారత ప్రభుత్వం 2002లో మనీల్యాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) తీసుకొచ్చింది. ఇది అత్యంత కఠినమైన చట్టం. పలు నేరాల ద్వారా సంపాదించిన ఆదాయాన్ని తిరిగి తీసుకోవడం, దానికి బాధ్యులైన వారికి శిక్ష విధించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఈ యాక్ట్ కింద అరెస్ట్ చేస్తే బెయల్ రావడం చాలా కష్టమవుతుంది. సాధారణ క్రిమినల్ కేసులలో నేరాన్ని నిరూపించాల్సిన బాధ్యత పోలీసులపైన ఉంటే, పీఎంఎల్ఏ చట్టంలో మాత్రం తాను ఏ తప్పూ చేయలేదని, తన ఆస్తులు చట్టబద్ధమైనవేనని ప్రూవ్ చేసుకునే అవసరం పూర్తిగా నిందితుడిపైనే ఉంటుంది.

## ప్రజల భాగస్వామ్యం లేకుండా

# కరవును ఎదుర్కోలేం

ముందుగానే తెలియజేయాలని నీటిని పొదుపుగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పించాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నేతలకు సూచించారు.రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రిజర్వాయర్లలో 20 శాతం కూడా నీరు లేదని.. కృష్ణా జలాల్లోనూ నిల్వలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే నెలల్లో సాగునీటి లభ్యత తీవ్రంగా పరిమితం అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. తాగడానికి నీళ్లు లేని పరిస్థితి వస్తే వ్యవసాయానికి నీరు ఎలా ఇవ్వగలం అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అందువల్ల రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగు విషయంలో జాగ్రత్తగా ఉండాలని తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలు, కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలని గతంలోనే సూచించిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కరువు పరిస్థితులపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి తప్పుబట్టారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల వచ్చిన కరువు అని ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ప్రకృతి పరిస్థితులను రాజకీయాలకు ముడిపెట్టి ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని సూచించారు. కరోనా సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. కరోనా సమయంలో కేసీఆర్ చెప్పిన మాటలు విని చాలామంది చనిపోయారని హరీష్ రావు మాటలు నమ్మి పంటలు వేయొద్దు నమ్మితే మట్టితో అంబలి చేసుకోవాల్సిందేనని పేర్కొన్నారు. ఇప్పుడు హరీష్‌రావు చెప్పే మాటలను నమ్మి రైతులు పంటలు వేసి నష్టపోవద్దని అన్నారు. కరువు తీవ్రతను ప్రజలకు వివరించడంలో అధికార పార్టీ నాయకులు వెనుకబడితే ప్రతిపక్ష ప్రచారమే ప్రజల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 20 వేల మెగావాట్లకు పైగా నమోదైందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడం సవాలుగా మారుతోందని పేర్కొన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ప్రభుత్వ ఆఫీసుల్లో అవసరం లేని ఫ్యాన్లు, ఏసీల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కూడా చెప్పారు. కరువు సమయంలో పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచడం ముఖ్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో అవసరమైన పనులు చేపట్టి ప్రజలకు ఉపాధి కల్పించాలని సూచించారు. సంక్రాంతి తర్వాత నుంచి మే నెలాఖరు వరకు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు.మొత్తంగా ఎల్‌నినో ప్రభావంతో రాబోయే నెలల్లో నీటి కొరత తీవ్రతరం కావచ్చన్న అంచనాల నేపథ్యంలో రైతులు, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యంగా పంటల ఎంపిక, నీటి వినియోగం, విద్యుత్ పొదుపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే సమయంలో కరువు అంశంపై బీఆర్ఎస్ నేతలతో సాగుతున్న రాజకీయ విమర్శలు కూడా ఈ సమావేశం నేపథ్యంలో మరోసారి తెరపైకి వచ్చాయి.

# శేరి సతిష్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేత

- కాంగ్రెస్‌లోనే ప్రయాణం - పదవులు శాశ్వతం కాదు
- పార్టీ పట్ల నిబద్ధత శాశ్వతం - నిబద్ధతకు గుర్తింపు
- రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన ఘట్టం
- కాంగ్రెస్ పార్టీలో నిజమైన కార్యకర్తలకు గుర్తింపు




కూకట్ పల్లి( ప్రశ్న న్యూస్)తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ చర్యల కమిటీ తన వివరణను పరిశీలించి, తనపై విధించిన సస్పెన్షన్‌ను అధికారికంగా ఎత్తివేయడం జరిగిందని కూకట్ పల్లి టౌన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నాయకత్వానికి, ముఖ్యంగా క్రమశిక్షణ చర్యల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ అనంతుల,డిసిసి నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరి దాదాపు 25 సంవత్సరాల పాటు పార్టీకి కంకణ బద్ధంగా పనిచేసిన తన పైన అకారణంగా స్థానిక "కుల నాయకులు "తప్పుడు ప్రచారం చేపించి పార్టీ నుండి తొలిగించే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఎన్ని ఆటంకాలు ఎదురైనా, ఎన్ని కష్టాలు వచ్చిన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, కార్యకర్తలను వీడకుండా ముందుకు సాగనని అన్నారు.తనను నమ్మి, తనకు అండగా నిలిచిన కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. తన లక్ష్యం పదవులు కాదని కూకట్ పల్లిలో పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ భవిష్యత్తు కోసం, క్రమశిక్షణను గౌరవిస్తూ, స్థానిక నాయకత్వంతో, జిల్లా కాంగ్రెస్ కమిటీతో సమన్వయంగా పనిచేస్తూ, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ఉద్ఘాటించారు.

# ఎన్నికల ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహన



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** అర్హులైన ఓటర్ల ఓట్ల తొలగింపు, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రజాసంఘాల నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, కమిటీ సభ్యుల మెజారిటీ అభిప్రాయాలను పక్కనపెట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడ్చల్ బస్ డిపో దగ్గర జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల ఓట్లు తొలగిస్తూ అధికార బిజెపి పార్టీకి ఏజెంట్ లాగా పని చేస్తూ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నందుకు అతని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేయాలని అన్నారు. కమిటీ సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, మెజారిటీ నిర్ణయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ విమర్శించారు. ఈ విధానం వల్ల అర్హత కలిగిన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు వేసే అవకాశం కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత అని నరేష్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించడంతోపాటు, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పక్షపాతానికి తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని, ఓటర్ల అభ్యంతరాలు, ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలు ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఉండాలని స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి ఎక్కాలదేవి కొమురయ్య, సీఐటీయూ మేడ్చల్ మండల నాయకులు నర్సింగ్ రావ్, యాదగిరి, నిత్యానంద్, ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల నాయకులు వినయ్, ప్రేమ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ స్థానానికి కూటమి ప్రభుత్వం నుండి పోటీ

**- జెడ్పీటిసి అభ్యర్థిగా మాజీ సర్పంచ్ అక్క మహాదేవి నామినేషన్ దాఖలు.**



**నందవరం:**మండల జెడ్పీటీసీ స్థానానికి కూటమి ప్రభుత్వం తరపున పూలచింత గ్రామానికి చెందిన బండే గురువు స్వామి సతీమణి మాజీ సర్పంచ్ అక్క మహాదేవి శుక్రవారం నామినేషన్ వేశారు. కర్నూలు జెడ్పీ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అక్క మహాదేవి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని,మహిళా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. తనపై నమ్మకంతో టికెట్ కేటాయించిన పార్టీ ఎమ్మెల్యే జయ నాగేశ్వర్ రెడ్డి,మండల కూటమి ప్రభుత్వం నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పిటిసి ఎంపీటీసీ నామినేషన్లకు ఎటువంటి అడ్డంకులు లేవు

**- ఎవరైనా అడ్డుకుంటే నామినేషన్లకు దగ్గరుండి మేమే వేయిస్తాం**

**- ఎస్ ఐ శ్రీనివాసులు వెల్లడి**




**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలో జడ్పిటిసి ఎంపిటిసి నామినేషన్లు శుక్రవారం చివరి రోజు కావడంతో ఎవరైనా నామినేషన్లు వేసేవారు నిర్భయంగా వెయ్యొచ్చని ఏటువంటి అడ్డంకులు ఉండవని రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు ఎటువంటి అడ్డంకులు జరిగితే దగ్గరుండి మేము సహకరించి నామినేషన్లు వేయిస్తామని తెలిపారు ఎమ్మిగనూరు పట్టణంలో ఎక్కడ ఏటువంటి గొడవలు లేవని అన్నారు ఎవరైనా కొత్తగా గొడవలు సృష్టించడానికి ప్రయత్నిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి నామినేషన్ వేసే హక్కు ఉందని నిర్భయంగా నామినేషన్ వేయొచ్చని అన్నారు శుక్రవారం తో నామినేషన్ ముగియడంతో ఎవరైనా వెంటనే వచ్చి నామినేషన్ వేయగలరని తెలిపారు

## నెల్లూరు 9, 10 డివిజన్లలో మంత్రి నారాయణ ప్రచారం

**నెల్లూరు** నెల్లూరు 9, 10వ డివిజన్ల పరిధిలోని సత్యనారాయణపురం, రివర్స్ కాలనీలో మంత్రి నారాయణ, అయన కుమార్తె షరణితో కలిసి పర్యటించారు. అయనకు ప్రజలు పూలవర్షం, మంగళహారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గత రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాంరు. నెల్లూరు అభివృద్ధి ప్రస్థానం నిరంతరం కొనసాగేందుకు మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్, 9వ డివిజన్ అభ్యర్థి శశి కుమార్, 10వ డివిజన్ అభ్యర్థి కిన్నెర కోటేశ్వరిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

## టీడీపీలో చేరిన డాక్టర్ కోడూరు శ్రావణ్ కుమార్ రెడ్డి దంపతులు



**ఆత్మకూరు** ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల వేళ పట్టణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆత్మకూరు మున్సిపాలిటీ తాజా మాజీ వైస్ చైర్మన్, వైసీపీ నాయకులు డాక్టర్ కోడూరు శ్రావణ్ కుమార్ రెడ్డి మరియు ఆయన సతీమణి డాక్టర్ మేకపాటి దీప్తి దంపతులు ఈరోజు మన తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి నేరుగా వారి నివాసానికి వెళ్లి, వారికి పార్టీ పసుపు కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం కుటుంబంలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ మన నియోజకవర్గంలో మనం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వారు స్వచ్ఛందంగా పార్టీలోకి రావడం ఎంతో సంతోషకరమని అన్నారు. . మన కుటుంబంలోకి కొత్తగా చేరిన డాక్టర్ మేకపాటి దీప్తి, డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి దంపతులకు పార్టీలో సముచిత గౌరవం లభిస్తుంది. మన అందరి ఐక్యతతో ఆత్మకూరులో కూటమి జెండాను మరింత ఎత్తున ఎగురవేద్దామని అన్నారు.

## చెస్‌లో ప్రతిభ చాటిన చిన్నారి మహిక

హైదరాబాద్

మూడేళ్ల వయసులోనే చెస్‌లో అసాధారణ ప్రతిభ చాటుతున్న మహిక నందేపు అరుదైన చెస్ రికార్డు సృష్టించే ప్రయత్నం చేసింది. జూబ్లీహిల్స్ ఎంపీ ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో కేవలం 30 నిమిషాల్లో 160 చెస్ బోర్డులపై బ్లైండ్ స్పైన్ మేట్ పజిల్స్‌ను పరిష్కరించి తన ప్రతిభను చాటుకుంది. ఫిడే ఆర్బిటర్ ఉజ్వల్ చౌహాన్ పర్యవేక్షణలో జరిగిన ఈ రికార్డు ప్రయత్నాన్ని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు కోసం పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఎమ్మెల్యే కాలనీ కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి, కార్యదర్శి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొని చిన్నారి మహికను అభినందించారు.

## నామినేషన్ వేయకుండా అడ్డుకున్నా, బెదిరింపులకు పాల్పడినా పోలీసులకు ఫిర్యాదు చేయండి:




**నందవరం** మండలంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో మీడియా సమావేశంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని సీఐ చిరంజీవి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా పార్టీ పరంగా నామినేషన్ వేయాలనుకునే అభ్యర్థులను బెదిరించినా, నామినేషన్ వేయకుండా అడ్డుకున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా నామినేషన్ వేసే అవకాశం ఉందని, ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే ఉపేక్షించబోమని తెలిపారు. బాధితులు వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని, ఇందుకోసం కేటాయించిన ఫోన్ నంబర్‌కు సీఐ 9121101164 , ఎస్సై 9121101150 కాల్ చేసి సమాచారం అందించాలని సీఐ చిరంజీవి కోరారు

## ఎస్ పురం జడ్పిటిసి అభ్యర్థిగా కోటపాటి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని, గుర్రం



**కనిగిరి** మార్కాపురం జిల్లా, కనిగిరి నియోజకవర్గం, సి ఎస్ పురం మండల కూటమి జెడ్పిటిసి అభ్యర్థిగా కోటపాటి జనార్ధన్ రావు జిల్లా కేంద్రమైన మార్కాపురంలో నామినేషన్ శుక్రవారం దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, పీసీ పల్లి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు గడ్డం బాలసుబ్బయ్య, తలకొండపాడు వెంకటేశ్వర్లు,కనిగిరి ఏఎంసీ వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, మోపాడు టిడిపి నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు, కనిగిరి కూటమి జెడ్పిటిసి అభ్యర్థి దంతులూరి ప్రకాశం, బైరెడ్డి జస్వంత్ రెడ్డి, గళ్ళ చెన్నయ్య, పోలు సుధాకర్ రెడ్డి, మేడసాని రమణయ్య, తిరుపతిరావు, తిరివీధి చంద్ర, కోటపాటి వెంకటేశ్వర్లు, యరశింగ్ రాయుడు, తదితర టిడిపి శ్రేణులు కోటపాటి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నామినేషన్లకు ఆటంకాలుంటే ఫిర్యాదు చేయండి

**- కలెక్టర్ జి. రాజకుమారి గణియా**



**నంద్యాల** ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా, ఎవరైనా అడ్డుకున్నా వెంటనే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నంబర్ 78159 59525 కు ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా తెలిపారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## 25న తుది జాబితా.. నవంబరు 1న పోలింగ్

**ఎన్నికల అధికారి సంజీయ్ కుమార్ ప్రకటన**



**నంద్యాల** నంద్యాల మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తుది జాబితాను అక్టోబరు 25న ప్రకటించడంతోపాటు, ఎన్నికల గుర్తులను కేటాయించనున్నట్లు మున్సిపల్ ఎన్నికల అధికారి సంజీయ్ కుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నవంబరు 1న నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైతే నవంబరు 2న రీపోలింగ్ చేపడతామని పేర్కొన్నారు. నవంబరు 3న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సంజీయ్ కుమార్ సూచించారు.

## శ్రీశైల దేవస్థానంలో సిఫార్సు లేఖల నిలిపివేత

**- ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) నేపథ్యంలో దేవస్థాన యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో వసతి మరియు స్వామి, అమ్మవార్ల దర్శనాలకు సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే మినహాయింపు:ఎన్నికల నిబంధనల దృష్ట్యా సాధారణ సిఫార్సు లేఖలను పూర్తిగా నిలిపివేసినప్పటికీ, కేవలం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే తగురీతిలో వసతి మరియు దర్శన ఏర్పాట్లు కల్పించబడతాయని దేవస్థానం వెల్లడించింది.

## జడ్పీటీసీ/ ఎంపిటిసి నామినేషన్లు వేసే అభ్యర్థులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

**- అనంతపురం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్**



**అనంతపురం :** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నామని అనంతపురం జిల్లా కలెక్టర్ ఒ జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే అభ్యర్థులను ఎవరైనా అడ్డుకున్నా లేదా భయభ్రాంతులకు గురిచేసినట్లు ఫిర్యాదులు వస్తే, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. నామినేషన్ వేసేందుకు వెళ్తున్న సమయంలో ఎవరైనా అడ్డంకులు సృష్టించినా లేదా అడ్డుకున్నా వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారులు, పోలీస్ లేదా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలనీ, ఆ మేరకు పోలీసులు, అధికారులు వారు నిర్భయంగా నామినేషన్ దాఖలు చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారనీ తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులందరి నామినేషన్లను స్వీకరించాలని ఇప్పటికే రిటర్నింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు అధికార యంత్రాంగం నిరంతరం సిద్ధంగా ఉందని, అభ్యర్థులు ఎటువంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి.. ఎమ్మెల్యే అమిలినేని



**కళ్యాణదుర్గం** మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు ముస్లిం సోదరులను కోరారు..నేడు కళ్యాణదుర్గం పట్టణం టీ సర్కిల్లో ఉన్న. మసీదు వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు, మున్సిపాలిటీ కూటమి చైర్మన్ అభ్యర్థి బుట్నా లక్ష్మి తిమ్మరాజు మున్సిపల్ కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు, టీడీపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు..అంతే కాకుండా గతంలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోని మున్సిపాలిటీని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దాలంటే పూర్తి స్థాయిలో కౌన్సిలర్లతో పాటు చైర్మన్ మన కూటమి వ్యక్తి గెలిస్తేనే సాధ్యమవుతుందని అది జరగాలి అంటే పట్టణంలోని ప్రతి ఓటరుకు విషయాన్ని తెలియజేసి ఓటు వేసేలా చూడాలని పేర్కొన్నారు..

## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు పూర్తి రక్షణ కల్పిస్తాం ...

**- ఇంకా ఎవరైనా అభ్యర్థులుంటే దాఖలు చేసుకోండి**

**- నామినేషన్ల దాఖలుకు ఎవరైనా అడ్డుకుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలి**

**- జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**అనంతపురం :** జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో అర్హులైన అభ్యర్థులు ఎలాంటి భయం, ఒత్తిడి, అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని జిల్లా ఎస్పీ పి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, బెదిరించడం లేదా ఇతర రూపాల్లో ఆటంకాలు కలిగించడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత ఎస్ హెచ్ ఓ, సి.ఐ లు లేదా డీఎస్పీల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అటువంటి ఫిర్యాదులపై విచారణ జరిపి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని, నామినేషన్ల దాఖలుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో అభ్యర్థులకు తగిన పోలీసు రక్షణ కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**- ఎస్పీ సునీల్ షొరాణ్ హెచ్చరిక**



**నంద్యాల** నంద్యాల జిల్లాలో మూడవ రోజు కొనసాగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నంద్యాల కళాశాలలోని నామినేషన్ కేంద్రంతో పాటు శిరివెళ్ల, రుద్రవరం ప్రాంతాల్లోని కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత కల్పించాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అనవసరంగా గుమిగూడడం, ర్యాలీలు నిర్వహించడం, అధిక సంఖ్యలో మద్దతుదారులను తీసుకురావడం వంటి చర్యలకు పాల్పడరాదని ఎస్పీ హెచ్చరించారు. అనుమతి పొందిన వ్యక్తులు, వాహనాలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.



## వేతనాలు చెల్లించాలంటూ ఎస్ఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీ ఎదుట కార్మికుల ఆందోళన

**రెండు నెలలుగా జీతాలు అందడం లేదని కార్మికుల వెల్లడి**

**రూ.6లక్షల వరకు వేతనాలు పెండింగ్ లో ఉన్నట్లు నిర్వాహకుల వెల్లడి**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుడ్లపోచంపల్లి డివిజన్ గౌడవెల్లిలో ఉన్న ఎస్ఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీ నిర్వాహకులు తమకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపిస్తూ కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు.కంపెనీ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.గత రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

### భారీ పైపులైన్ పనుల్లో కార్మికులు

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో మేడ్చల్ శివారులోని ఘనపూర్ గుట్ట నుంచి భారీ పైపులైన్ల ద్వారా నగరానికి మంచినీటిని తరలించే పనులు జరుగుతున్నాయి.ఈ పనులను రాంకీ సంస్థకు అప్పగించగా, ఆ సంస్థ ఎస్ఆర్ కన్స్ట్రక్షన్‌కు సబ్‌కాంట్రాక్టు ఇచ్చింది.ఎస్ఆర్ కన్స్ట్రక్షన్ సంస్థకు రాహుల్ వెల్డర్ అనే మరో కాంట్రాక్టర్ కార్మికులను సమకూరుస్తున్నట్లు తెలిపారు.ఈ పనుల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుమారు 60 మంది కార్మికులు పనిచేస్తున్నారు.అయితే, గత రెండు నెలలుగా తమకు వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.దాదాపు రూ.6లక్షల వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు కంపెనీ నిర్వాహకులు తెలిపారు.

### దసరా పండుగకూ ఆర్థిక ఇబ్బందులు

రోజుకు సుమారు 10 గంటల పాటు పనిచేయించుకుంటున్నప్పటికీ, తమకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని కార్మికులు వాపోయారు. కనీస నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు కూడా డబ్బులు లేకపోవడంతో దసరా పండుగ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఇక్కడికి వచ్చి పనిచేస్తున్నామని, అయినప్పటికీ కష్టానికి తగిన వేతనం సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

### కార్మిక శాఖ అధికారులు స్పందించాలి

తమకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.కార్మిక శాఖ అధికారులు ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, పెండింగ్ వేతనాలు ఇప్పించడంతో పాటు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కార్మికులు అశోక్ ప్రసాద్,అజయ్ సింగ్,అక్షయ కుమార్,రోషన్ కుమార్,బాయ్య లాల్ సింగ్,సుమంత్ చౌహాన్,రాజేష్ యాదవ్,మగేశ్ డోర్లికర్,ఉమేష్ చౌహాన్, అమరనాథ్,అజిత్ కుమార్,మనోజ్ నవిక్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు జలమండలి మరో కీలక చర్యకు సిద్ధం అవుతోంది. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నగరంలో తాగునీటి కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలోనే నిర్మాణ పనులు, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించేలా 'గ్రీన్ వాటర్' సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) యోచిస్తోంది. ఇందులో భాగంగా కోకాపేటలో ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసే అవకాశాలను జలమండలి పరిశీలిస్తోంది. ఈ ప్రత్యేక గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే తాగడానికి ఉపయోగించే నీటిని ఇతర పనులకు వినియోగించాల్సిన అవసరం తగ్గనుంది.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను పరిశీలించేందుకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ కె. అశోక్‌రెడ్డి గురువారం కోకాపేటలో పర్యటించారు. అక్కడి నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను పరిశీలించి.. పరీక్షలు నిర్వహించే విధానం, పాటిస్తున్న ప్రమాణాలు, ఫలితాలను నమోదు చేసే ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు సరఫరా చేయాలంటే దాని నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని.. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా క్రమం తప్పకుండా నీటి పరీక్షలు నిర్వహించాలని అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలమండలి అధికారులతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీఎస్‌పీసీబీ) అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నీటి నాణ్యతకు సంబంధించిన పరీక్షల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. ఈ వివరాలను హైదరాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయం నుంచే నేరుగా పర్యవేక్షించేలా వ్యవస్థను రూపొందించాలని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు ఐటీ విభాగంతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.

నీటి పరీక్షల వివరాలు పారదర్శకంగా ఉండటంతో పాటు అవసరమైనప్పుడు సులభంగా అందుబాటులో ఉండేలా రికార్డులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల నీటి నాణ్యతపై పర్యవేక్షణ మెరుగుపడటంతో పాటు సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.గ్రీన్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ట్యాంకర్లకు నీటిని నింపే విధానంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రతి ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి నీటి నింపే పరిమితులను నిర్ణయించాలని అశోక్‌రెడ్డి ఆదేశించారు. ఒక్కో ట్యాంకర్‌కు ఎంత నీటిని సరఫరా చేశారు.. దాని సామర్థ్యం ఎంత.. వంటి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ట్యాంకర్లలో నిర్ణీత పరిమితికి మించి నీరు నింపకుండా నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు.
అదనంగా మిగిలే నీటిని వృథా చేయకుండా సంబంధిత చెరువుకు మళ్లించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.శుద్ధి చేసిన నీటిని తాగునీటికి ప్రత్యామ్నాయంగా కాకుండా.. తాగడానికి అవసరం లేని పనులకు వినియోగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జలమండలి అధికారులు చెబుతున్నారు. ఈ నీటిని నిర్మాణ రంగం, పరిశ్రమలు, రోడ్ల శుభ్రత, దుమ్ము నియంత్రణ, పార్కులు, తోటల నిర్వహణ వంటి అవసరాలకు ఉపయోగించేలా నగరప్రజలను ప్రోత్సహించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనుల్లో తాగునీరు వినియోగించే సందర్భాలు తగ్గితే నగరంలోని తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.అయితే.. ఈ శుద్ధి చేసిన నీటిని ఏయే అవసరాలకు ఎంత పరిమాణంలో సరఫరా చేయాలన్నది నాణ్యత ప్రమాణాలు, భద్రతా నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించాల్సి ఉంటుంది. ఫిల్లింగ్ స్టేషన్లలో నీటి నాణ్యత, సరఫరా పరిమాణం, భద్రతా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని జలమండలి స్పష్టం చేసింది. కోకాపేటలో గ్రీన్ వాటర్ కేంద్రం ఏర్పాటుపై సాంకేతిక పరిశీలన కొనసాగుతుండగా.. దాని ఏర్పాటు, అమలు తేదీ, సరఫరా సామర్థ్యంపై అధికారికంగా మరిన్ని వివరాలు వెల్లడించాల్సి ఉంది.

## చాముండేశ్వరి పీఠంలో చండీ పారాయణాలు

**హైదరాబాద్** శ్రీ చాముండేశ్వరి అనుగ్రహ పీఠంలో పీఠాధిపతులు బ్రహ్మశ్రీ కృష్ణ చాముండేశ్వరి మహర్షుల ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం చండీ పారాయణాలు, మంత్రానుష్ఠానాలు, దీక్షలు బంజారాహిల్స్ శ్రీనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. సుమారు 1108 వనమూలికలతో చండీ హోమం నిర్వహించి, శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా మహర్షులు మాట్లాడుతూ, భూతాపాన్ని తగ్గించేందుకు ప్రకృతి పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- కుళ్ళిన పదార్థాలతో 'ఏ-1' పేస్ట్ తయారీ
- దుమ్ము, బూజుల మధ్య అపరిశుభ్రంగా తయారీ
- ఎస్వోటీ, పోలీసుల మెరుపు దాడిలో బట్టబయలైన కల్తీ దందా
- 440 కిలోల కుళ్ళిన నిల్వలు స్వాధీనం.. ల్యాబ్‌కు శాంపిల్స్
- ప్రజారోగ్యంతో చెలగాటమాడితే లైసెన్స్ రద్దు...అధికారుల హెచ్చరిక
- కల్తీపై సమాచారం కోసం ఫిర్యాదు నంబర్ 9100057950



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో కుళ్ళిపోయిన పదార్థాలతో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న ముఠా గుట్టును ఎస్‌ఓటి, మేడ్చల్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు రట్టు చేశారు. మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని అత్వెల్లి ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఏ-1 జింజర్ గార్లిక్ పేస్ట్ తయారీ యూనిట్‌పై





తెలంగాణ ఆహార భద్రతా విభాగం, ఎస్‌వోటీ, టీజీ సేఫ్ పోలీసులు సంయుక్తంగా మెరుపు దాడి నిర్వహించారు. హయత్‌నగర్ సర్కిల్-14 ఫుడ్ సేఫ్టీ అధికారితో పాటు ఇతర ఉన్నతాధికారులు చేపట్టిన ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు, తీవ్ర నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి.

### 440 కిలోల కుళ్ళిన నిల్వలు సీజ్.. ల్యాబ్‌కు నమూనాలు

ఈ తనిఖీల్లో ఒక్కొక్కటి 20 కేజీల బరువు గల 22 బస్తాల్లో ఉన్న సుమారు 440 కిలోల బూజు పట్టిన, కుళ్ళిపోయిన వెల్లుల్లితో పాటు మరో 50 కిలోల పాడైపోయిన అల్లంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కుళ్ళిన ముడిసరుకుతోనే 'ఏ-1' బ్రాండ్ పేరుతో అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసి మార్కెట్‌కు



గుట్టుగా సదరు యూనిట్ నిర్వాహకుడు ఎండి. అలీముద్దీన్ (43) ఆహార భద్రతా నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి సరఫరా చేస్తున్నట్లు తేలింది. తక్షణమే ఆ నిల్వలను నాశనం చేసి పారవేయాలని నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశారు. యూనిట్ నుంచి సేకరించిన నమూనాలను సమగ్ర విశ్లేషణ కోసం ల్యాబ్‌కు పంపించడంతో పాటు, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సదరు కేంద్రం లైసెన్స్‌ను రద్దు చేయాల్సిందిగా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

### నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే కఠిన చర్యలు

ఆహార పదార్థాల తయారీదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా 'గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' పాటించాలని, పరిశుభ్రమైన వాతావరణంలోనే వస్తువులను తయారు చేయాలని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. లాభాపేక్షతో నిబంధనలు




ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మేడ్చల్ పరిధిలో అల్లం వెల్లుల్లి పేస్ట్ మాత్రమే కాకుండా పాలు, నూనెలు, ఇతర నిత్యావసర ఆహార పదార్థాలలో కల్తీ లేదా నాణ్యతా లోపాలు ఉన్నట్లు అనుమానం వస్తే ప్రజలు 9100057950 నంబర్‌కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారి సన్నీ, అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ అధికారిణి అమృత శ్రీ, తెలంగాణ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ఎస్సై రాములు నాయక్, ఎస్ఓటి ఎస్సై రాజేష్, సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మూడేండ్లయినా ముచ్చట లేదు..

**- ఊసే లేని హనుమకొండ కొత్త బస్ స్టేషన్ నిర్మాణం**

**హనుమకొండ :** వరంగల్ రెండో రాజధాని అని మంత్రులు పదేపదే చెబుతున్న ప్రకటనలకు, అభివృ ద్ధిలో ప్రభుత్వ తీరుకు పొంతన కుదరడం లేదు. రవాణాలో కీలకమైన హనుమకొండ బస్ స్టేషన్ కొత్త భవనం నిర్మాణంలో కాంగ్రెస్ సర్కారు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నది. ప్రతి రోజూ 3 లక్షల మంది రాకపోకలు సాగించే ఈ బస్టాండ్ కొత్త భవన నిర్మాణాన్ని పట్టించుకోవడంలేదు. అధికారంలోకి వచ్చి మూడేండ్లు పూర్తవుతున్నా ఒక్క ఇటుకైనా పెట్టలేదు. దీని నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.83 కోట్లు మంజూరు చేసింది. 2023 అక్టో బర్లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు మొదలు కాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. మూడేండ్లు పూర్తవుతున్నా దాని ముచ్చటే మరిచింది. పట్టించుకోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు: ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపో వడంతో హనుమకొండ బస్టేషన్ కొత్త భవన నిర్మాణ పనులు మొదలు కావడంలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదలుపెట్టిన పనులను పూర్తి చేసే విషయంలోనూ కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తు న్నది. అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు లేదు. పాత పనులను పూర్తి చేసేందుకు మంజూరైన నిధులను విడుదల చేయడం లేదు. లక్షల మంది ప్రయాణికులతో కిక్కిరిసిపోయే హనుమకొండ బస్ స్టేషన్ ప్రస్తుతం దయనీయంగా ఉన్నది. ఎలాంటి వసతులు లేక ప్రయాణికులు ఇబ్బంది. పడుతున్నారు. మహిళా ప్రయాణికులు అవస్థలు చెప్పలేని విధంగా ఉన్నా యి. టాయిలెట్స్ వసతి లేదు. తాగునీరు అసలే ఉండడంలేదు. పండుగ సమయాల్లో రోజువారీ కంటే రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు వస్తుం టారు. బస్సుల కోసం నిల్చునేందుకు వారికి స్థలం సరిపోవడం లేదు. శిథి లావస్థలో ఉన్న ప్రస్తుత భవనానికి మరమ్మతులు చేసినా ఉపయోగం ఉండ దని, కొత్తది నిర్మిస్తేనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు చెబుతున్నారు. వాటి నిర్మాణ పనులు అస్సలు మొదలు కావడంలేదు. రద్దీ ఫుల్.. వసతులు నిల్: హనుమకొండ బస్ స్టేషన్ ప్రస్తుత భవనం 1974లో ప్రారంభ మైంది. 16 ఎకరాల విస్తీర్ణం ఉన్నా భవనం చిన్నగా ఉండడంతో రద్దీకి అనుగుణంగా వసతులు లేవు. 1990లో మరో కొత్త భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రయాణికులు వేల రెట్లు, వందల బస్సులు పెరి గాయి. పార్కింగ్ సౌకర్యం లేదు. ప్రస్తుత భవనం పెచ్చు లూడి



శిథిలావస్థలో ఉన్నది. ఇక్కడి నుంచి ప్రతి రోజూ 1500 బస్సులు వేల సర్వీసులతో 3 లక్షల మంది ప్రయా ణిస్తుంటారు. పండుగ సీజన్లు? సోమవారం, శనివా రాల్లో 350 బస్సులు నడుస్తున్నాయి. రోజురోజుకూ ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నది. వరంగల్-హైదరా బాద్ రూట్లో బస్సులు సరిపోకపోవడంతో వందల ప్రైవేటు వాహనాల్లో ప్రయాణికులు వెళ్తుంటారు. రద్దీ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక వసతు లతో బస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.85 కోట్లు మంజూరు చేసింది. స్మార్ట్ సిటీలో భాగంగా హనుమకొండ బస్టాండు కొత్త భవనం నిర్మించేలా ఆర్టీసీ ప్రతి పాదనలు సిద్ధం చేసింది. ఆ తర్వాత దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించింది. కొత్త భవన నిర్మాణ పనులను పట్టించుకోవడం లేదు. వసతుల లేమితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

## ప్రశాంత వాతావరణంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

**- నామినేషన్ కేంద్రాలలో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**



**కడప** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా కడప నగరంలోని వైఎస్సార్ కడప జిల్లా ప్రజా పరిషత్ (జడ్పీ) కార్యాలయంలో జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రం తో పాటు కలెక్టరేట్, కాగితాల పెంట, గాంధి నగర్ మునిసిపల్ హైస్కూల్ లోని నామినేషన్ కేంద్రాలను జిల్లా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ స్వయంగా పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం డ్రోన్ కెమెరాల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.జిల్లా ప్రజా పరిషత్ కేంద్రం లో భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన తరువాత ఎస్పీ మాట్లాడుతూ.. నామినేషన్ల చివరి రోజు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జడ్పీ కార్యాలయం లోపల, ప్రధాన ద్వారాల వద్ద మరియు పరిసర ప్రాంతాలలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. ట్రాఫిక్ కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.పోలీస్ అధికారులు ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందు నుండే రాత్రింబవళ్ళు శ్రమిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పూర్తిగా ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులందరికీ పూర్తి రక్షణ కల్పించామని, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు.నామినేషన్ల ప్రక్రియపై సోషల్ మీడియా లో ప్రతి వీడియో నమ్మలేమని, ఇతర మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలు, వక్రీకరించిన సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించారు. అభ్యర్థులకు ఏవైనా ఇబ్బందులు లేదా సమస్యలు ఉంటే నేరుగా లిఖితపూర్వక వినతిపత్రం (ఖీవజూతీవబవనిబిజీబితినీని) సమర్పిస్తే చట్టపరంగా తగిన రక్షణ కల్పిస్తామని తెలిపారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు , కడప డి.ఎస్పీ టి. భవాని , పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## జవహర్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మధిర:** మధిర మండలం వంగవీడు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కృషితో రూ.630.30 కోట్లతో నిర్మితమవుతున్న జవహర్ ఎత్తిపోతల పథకం పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. జవహర్ ఎత్తిపోతల పథకం పూర్తయితే మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని వ్యవసాయ భూములకు సాగునీటి సదుపాయం మెరుగుపడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.రైతుల కష్టాలను గుర్తించి, వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో భట్టి విక్ర మార్క గారు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రైతాంగానికి అండగా నిలుస్తాయని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సమస్యలు తగ్గి, వ్యవసాయ రంగానికి మరిం త ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పులిబండ్ల చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరం శెట్టి కిషోర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సిద్దిపోగు ప్రసాద్, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తన్నీరు రామకృష్ణ, లక్ష్మారెడ్డి, ఎక్కిటాల కృష్ణారావు, ఓబుల్ లక్ష్మారెడ్డి, బండి వెంకటేశ్వర్లు, గూడెల్లి వెంకటేశ్వర్లు, దశ్రీ కిరణ్, సక్రు, బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో వేడెక్కిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల రాజకీయం

**పోలీసుల తీరును నిరసిస్తూ టీడీపీ నాయకుల ధర్నా**



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్ ) శ్రీకాళహస్తిలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రతిపక్ష అభ్యర్థులకు కేంద్ర బలగాల రక్షణ కల్పించి నామినేషన్ కేంద్రాలకు తీసుకెళ్లడంపై తెలుగుదేశం పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం లేదని ఆరోపించారు. ప్రతిపక్ష అభ్యర్థులకు కేంద్ర బలగాల రక్షణ కల్పించి నామినేషన్లు వేయించాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు.పోలీసుల వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు.తనకున్న ధనబలంతో కోర్టులో స్టే తెచ్చి ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిగిన ఎన్నికల తీరును కూడా వారు ప్రస్తావించారు.నిన్న జరిగిన నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వేలాది మంది వైసీపీ నాయకులతో వచ్చి టీడీపీ నాయకులను దుర్భాషలాడారని వారు ఆరోపించారు. అలాంటి పరిస్థితుల నేపథ్యంలో వైసీపీ నాయకులకు పోలీసులు రక్షణ కల్పిస్తూ ప్రాధాన్యత ఇస్తున్నారని టీడీపీ నాయకులు విమర్శించారు.ఎన్నికల ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలని,పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ పరిణామాలతో శ్రీకాళహస్తిలో స్థానిక సంస్థల ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కింది.

# పెద్దల సభకు మేధావులను పంపండి:పొన్నం ప్రభాకర్

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యే శ్రీగణేష్**



కంటోన్మెంట్(ప్రశ్న న్యూస్) పట్టభద్రుల ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్, రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మారేడ్ పల్లిలోని టీచర్స్ కాలనీ పార్క్ సమీపంలో గల జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో నిర్వహించిన హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ “6”వ తేదీన వరకు గ్రాడ్యుయేట్లుగా ఓటరు నమోదు చేసుకునే అవకాశం ఉందని పొన్నం గుర్తు చేశారు.అలాగే మీ ప్రాంతంలో అర్హులైన గ్రాడ్యుయేట్లును గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ పాల్గొన్నారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు జోష్ పెంచాలి బోర్డు పరిధిలో ఎంతో మంది మేధావులు ఉన్నారు,కానీ వారు గ్రాడ్యుయేట్లుగా ఓటరు నమోదు చేసుకోలేదు అలాంటి వారిని గుర్తించి యుద్ధప్రాతిపదికన ఎన్రోల్మెంట్ కార్యక్రమంనిర్వహించాలన్నారు.ఈ సందర్భంగా నిన్నటి కార్యక్రమంలో అర్హులైన గ్రాడ్యుయేట్లకు ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించి,వారి పేర్లను ఓటర్ జాబితాలో నమోదు చేయించడం జరిగింది.ప్రతి అర్హుడైన గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని మంత్రులు సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో కీలకమైనది. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ పేరును ఓటర్ జాబితాలో నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వాములు కావాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్,రాజేష్ యాదవ్, కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆదిత్య యాదవ్,సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం కమిటీ మాజీ ఛైర్మన్ సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధమవుతున్న టిమ్స్...

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని సనత్‌నగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో త్వరలో శస్త్రచికిత్స సేవలు దశలవారీగా ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఔట్‌పేషెంట్ సేవల ద్వారా రోగులకు వైద్యసేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి, ఇకపై ఆపరేషన్లు, అత్యాధునిక ఇన్‌పేషెంట్ చికిత్సలను కూడా అందించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది రోగులకు ఈ నిర్ణయం ఊరటనివ్వనుంది. ముఖ్యంగా నగరంలోని ప్రధాన ప్రభుత్వ వైద్యశాలల్లో పెరుగుతున్న రోగుల రద్దీని తగ్గించడంతోపాటు, అవసరమైన వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు ఈ విస్తరణ దోహదపడనుంది.ఆపరేషన్ థియేటర్లు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తవడంతోపాటు, వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టడంతో శస్త్రచికిత్స సేవల ప్రారంభానికి మార్గం సుగమమైంది. ఆగస్టులోనే ప్రారంభమైన ఈ ఆసుపత్రికి ప్రస్తుతం రోజుకు సుమారు 600 మంది ఔట్‌పేషెంట్లు వస్తున్నారు. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న వైద్య సేవలను మరింత విస్తరించి, శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు కూడా చికిత్స అందించే దిశగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.సుమారు రూ.1,126 కోట్ల వ్యయంతో 53 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రిలో మొత్తం 1,082 పడకలు ఉన్నాయి. వీటిలో 300 పడకలను ఐసీయూ సేవల కోసం కేటాయించారు. అలాగే 31 ప్రధాన ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. భారీ వైద్య మౌలిక సదుపాయాలతో ఏర్పాటైన ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభిస్తే రాష్ట్ర ప్రభుత్వ వైద్య రంగంలో కీలకమైన మార్పు వచ్చే అవకాశముంది. అత్యవసర చికిత్సలు, క్లిష్టమైన శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు అదనపు వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.శస్త్రచికిత్స సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆసుపత్రి మరింత ఎక్కువ సంఖ్యలో కేసులను నిర్వహించగలదని టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఏ. నరేంద్ర తెలిపారు. దీనివల్ల ప్రస్తుతం అధిక రోగుల భారాన్ని ఎదుర్కొంటున్న ఇతర ప్రభుత్వ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గుతుందని, రోగులకు సకాలంలో చికిత్స అందే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అయితే, అన్ని శస్త్రచికిత్స సేవలను ఒకేసారి ప్రారంభించకుండా దశలవారీగా విస్తరించనున్నారు. ఆపరేషన్ థియేటర్లు, వైద్య బృందాలు, సహాయక విభాగాలు పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్న కొద్దీ ఆపరేషన్ల సంఖ్యను పెంచనున్నారు. అదనపు ఐసీయూ పడకలు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి రావడం వల్ల శస్త్రచికిత్సల కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది.

# జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై బీజేపీ పోరుబాట

**27 నుంచి ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్ర.. 25న రౌండ్ టేబుల్ సమావేశం**

**ప్రజలు, మీడియా ఉద్యమానికి మద్దతుగా నిలవాలని పిలుపు**

**ప్రజారోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదు..**

**సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం: ఈటల రాజేందర్**

**పాదయాత్రలో పాల్గొంటా: బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



కీసర ( ప్రశ్న న్యూస్) జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న కాలుష్యంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డును తరలించాలని కోరుతూ ఈ నెల 27 నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 25న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు.

### పేదల ఆరోగ్యంతో చెలగాటం వద్దు

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రభావం సుమారు 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలపై పడుతోందని ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. కీసర, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ ప్రాంతాల్లో ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్నారని, కాలుష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. లీచేట్ నీటి వల్ల చెరువుల్లో చేపలు చనిపోతున్నాయని, మహిళలు గర్భస్రావాల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు చెబుతుంటే బాధ కలుగుతోందన్నారు. డంపింగ్ యార్డు కాలుష్యంతో క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయన్న ఆందోళనలు ఉన్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిగణించాలని కోరారు. పేదలు నివసించే ప్రాంతం కావడంతోనే వారి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని హితవు పలికారు.

### రేవంత్ రెడ్డిపై ఈటల విమర్శలు

ప్రశ్నించే గొంతుక అంటూ రేవంత్ రెడ్డికి ఓటు వేసి ఎంపీగా గెలిపిస్తే, ఆ అవకాశాన్ని రాజకీయ ఎదుగుదలకు మెట్టుగా వాడుకున్నారే తప్ప ఈ ప్రాంత ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఈటల రాజేందర్ విమర్శించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికతో ముందుకు రావాలని కేంద్ర మంత్రి సూచించినట్లు తెలిపారు.

### పాదయాత్రలో పాల్గొంటాం: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రలో తాము కూడా పాల్గొంటామని ప్రకటించారు.

### పలువురు బీజేపీ నాయకుల హాజరు

ఈ సన్నాహక సమావేశంలో బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకుడు మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఎస్. మల్లారెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గండే, మాజీ ఎంబీసీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సామా రంగారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.కే. శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, తిర్మల్ రెడ్డి, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, ఎల్లంపేట్ మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శామీర్‌పేట్ మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, జవహర్‌నగర్ మాజీ కార్పొరేటర్ బాబు, మాజీ ఎంపీటీసీ రషీదా బేగం, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ ఆనంద్‌తో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# ఫేక్ గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ ను అడ్డుకుంటాం

**అడవిలో తామే పులులమని అందరూ చెప్పుకుంటారు.. వారిని బంధించే వేటగాడు వచ్చాడనే విషయం గుర్తు పెట్టుకోండి**

**మానవత్వంతో కూడిన మార్పు హైదరాబాద్ లో రాలే**

**కనీసం తాగునీళ్లు ఇవ్వలేనోళ్లం విశ్వనగరం అని ప్రచారం చేసుకుంటున్నాం**

**గ్రేటర్ లోని మూడు కార్పొరేషన్లలో టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్ ) ఫేక్ అగ్రిమెంట్లు, ఫేక్ పెట్టుబడులతో నిర్వహిస్తున్న ఫేక్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్ అడ్డుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గతేడాది తెచ్చామని చెప్పుకుంటున్న ఆరున్నర లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన శ్వేతప్రతాన్ని విడుదల చేయాలని లేదంటే డిసెంబర్ లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్ అడ్డుకోని తీరుతామని శుక్రవారం మియాపూర్ లో జరిగిన టీఆర్ఎస్ రాజధాని రణభేరి సభలో హెచ్చరించారు. హైదరాబాద్ అభివృద్ధికి పెట్టుబడులు కావాలని తాము కోరుకుంటున్నామని కానీ అబద్దాలు, నకిలీ పెట్టుబడులతో మోసం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మరికొన్ని రోజుల్లో బల్దియా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, క్యాడర్ తో రాజధాని రణభేరి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బల్దియా ఎన్నికలకు సంబంధించి కేడర్ కు దిశానిర్దేశం చేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ గ్రేటర్ లోని మూడు కార్పొరేషన్లలో టీఆర్ఎస్ జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలో పోటీ చేస్తామని ఆమె చెప్పారు. కనీసం తాగటానికి కూడా మంచి నీళ్లు ఇవ్వనోళ్లు విశ్వనగరమంటూ ప్రచారం చేసుకుంటున్నారని..వీళ్లా హైదరాబాద్ ను న్యూయార్క్, లండన్ చేసేదంటూ ఎద్దేవా చేశారు. నగరంలో సరైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచి నీళ్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదని.. దోమలు, కుక్కలు స్వైర విహారం చేస్తుంటే పట్టించుకున్న నాథుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి లైట్లు ఎప్పుడు వెలుగుతాయో ఎవరికీ తెలియదని, సీనియర్ సిటిజన్స్ కు భద్రత, గౌరవం లేని పరిస్థితి ఉందన్నారు. హైదరబాద్ లో చెప్పులను ఏసీ షోరూమ్ లల్లో కూరగాయలు, చేపలను రోడ్లపై పెట్టి అమ్ముతున్నారన్నారు. ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వానికి సోయి లేదని విమర్శించారు. కూరగాయలు, చేపలు అమ్మే వారికి ఏసీ బండ్లను ఇవ్వాలని కోరారు. బస్తీ దవాఖానాల్లో డాక్టర్ల సంఖ్య పెంచాలని, ప్రతి డివిజన్ లో 24 గంటలు నడిచే హాస్పిటల్ ఉండాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. ఫాగింగ్, రోడ్ల నిర్మాణంలో, కుక్కల బెడద నివారణ, చెత్త, డ్రైనేజీ నిర్వహణ ఇలా అన్నింటిలో అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు.

### మానవత్వంతో కూడిన మార్పు రాలే..

హైదరాబాద్ లో మానవత్వంతో కూడిన మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 10 వేలు జీతం వచ్చే వారైనా లక్ష రూపాయలు జీతం వచ్చే వారైనా సరే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రూపీ వ్యాల్యు తగ్గటం, ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవటంతో విపరీతంగా ధరలు పెరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రదర్స్ ల్యాండ్ గ్రాబింగ్ కారణంగా హైదరాబాద్ చుట్టు పక్కల పంటలు పండే భూమి కోల్పోతున్నామని చెప్పారు. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి కోసం కాకుండా అవినీతి కోసం వాడుకుంటున్నారన్నారు. ఐటీ ఉద్యోగులు ఏఐ కారణంగా ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వస్తే వారిని ఆదుకునేందుకు ఒక పాలసీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ను ఐటీ నగరంగా నిలబెట్టిన ఐటీ ఉద్యోగులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ లో చెత్త సేకరించే 50 వేల మంది ఉద్యోగులపై రేవంత్ రెడ్డి కన్నుపడిందని..వారికి నష్టం చేస్తూ రామ్ కీ సంస్థకు మేలు చేయాలని చూస్తున్నారని చెప్పారు. ఆ 50 వేల మంది కుటుంబాల పరిస్థితి ఏంటనీ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. వారికి నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని ముఖ్యమంత్రి ఇంటి ముందు చెత్తవేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ లో కొత్తగా ఒక్క ప్రభుత్వ స్కూల్ కూడా కట్టటం లేదని..కార్పొరేట్ స్కూళ్లకు మేలు చేసేందుకే ఇలా చేస్తున్నారని అన్నారు. సముద్రం లేని హైదరాబాద్ ను నిజాంలు పెర్ల్ సిటీ గా అభివృద్ధి చేస్తే ఈ ముఖ్యమంత్రి మాత్రం ప్రజలకు కనీస సౌకర్యాలు అందించటం లేదని ధ్వజమెత్తారు. బిర్యానీ, ఇరానీ ఛాయ్, ముత్యాలకు ప్రసిద్ధి చెందిన నగరాన్ని దోమలకు నిలయంగా, కుక్కకాట్లకు కేంద్రంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### బంధించే వేటగాడు వచ్చాడనే విషయం గుర్తు పెట్టుకోండి

బీఆర్ఎస్ పార్టీ తాము షేర్ అని, కాంగ్రెస్ బబ్బర్ షేర్ అని చెప్పుకుంటున్నాయని కానీ ఆ పులులను బంధించే వేటగాడైన టీఆర్ఎస్ పార్టీ వచ్చిందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కవిత హెచ్చరించారు. ప్రజలకు చేయాల్సింది చాలా ఉందని అందుకోసం ఎంతో క్రమశిక్షణతో పనిచేయాలని పార్టీ కేడర్ కు ఆమె సూచించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలనుకునే వాళ్లు ప్రజలకు తమ ద్వారా న్యాయం జరుగుతుందని నమ్మకం కలిగించాలని చెప్పారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ లో అన్ని సౌకర్యాలు అందిస్తామని, ప్రజలకు ఉచిత విద్య, వైద్యం ఇస్తామన్నారు. ప్రజల కోసం పనిచేసే తమతో పెట్టుకోవద్దని ప్రత్యర్థి పార్టీలను హెచ్చరించారు. టీఆర్ఎస్ పార్టీ విధానాలను గల్లీ గల్లీకి వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ కేడర్ కు సూచించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక యూత్ కు 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలని అప్పుడే రాజకీయాలు మారుతాయని చెప్పారు. పాతబస్తీ లో ఉన్న నాయకులు ముఖ్యమంత్రి గులామ్ గా కాకుండా ప్రజలకు గులామ్ గా ఉండాలన్నారు. పాతబస్తీ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని కోరారు. ముస్లింలను అన్ని పార్టీలు మోసం చేశాయని వారికి తాము మేలు చేస్తామని చెప్పారు. కొత్తగా వచ్చిన మన పార్టీ ఇతర పార్టీలతో పోల్చితే పది రెట్లు ఎక్కువ కష్టపడాలన్నారు.

# శ్రీకాళహస్తిలో ప్రజాస్వామ్యానికి విఘాతం,వైఎస్సార్‌సీపీ నేతలు

**నామినేషన్ల ప్రక్రియలో అడ్డంకులు, దాడులు జరిగాయని ఆరోపణలు**



శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్)రాష్ట్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. రాష్ట్రంలో అధికార పక్షం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గురువారం శ్రీకాళహస్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. నామినేషన్లకు అడ్డంకులు సృష్టించారని ఆరోపణ ఆధ్యాత్మిక క్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఎన్నడూ లేని విధంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో తమ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో పోలీసులు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జ్ చేశారని విమర్శించారు. నామినేషన్లు వేయడానికి వెళ్లిన మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించారని, వారి చీరలు లాగారని, వాహనాలను ధ్వంసం చేశారని, అడ్డువచ్చిన వారిపై దాడులు చేశారని టీడీపీ నాయకులపై ఆరోపణలు చేశారు. ఇలాంటి ఘటనల వల్ల కార్యకర్తలపై కేసులు నమోదై వారి భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ విభేదాలను హింసకు దారితీయకుండా చూడాలని సూచించారు.ఎస్ఈసీకి ఫిర్యాదు. న్యాయపోరాటానికి సిద్ధం తమ పార్టీ నాయకులు, అభ్యర్థులపై జరిగినట్లు చెబుతున్న దాడులు, అవమానాలకు సంబంధించిన ఆధారాలతో రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) ఫిర్యాదు చేస్తామని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

# ‘418’ – మూవీ రివ్యూ!



చైత్ర జె ఆచార్ .. ఓటీటీ ప్రేక్షకులకు ఈ పేరు సుపరిచితమే. నటిగా ఆమెకి మంచి పేరు ఉంది. ఆమె ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే ‘418’. హారర్ థ్రిల్లర్ జోనర్లో రూపొందిన సినిమా ఇది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాకి సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. మైత్రీ మూవీ మేకర్స్ వారు ఈ సినిమాను విడుదల చేయడం మరో విశేషం. కీర్తన్ నాదగౌడ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. అది ఊరికి దూరంగా .. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న ఒక మెడికల్ కాలేజీ. దాదాపు 15 ఏళ్లుగా మూతబడి ఉన్న ఆ కాలేజ్ ను ఆ ఏడాదే తిరిగి ఓపెన్ చేస్తారు. ఆ కాలేజ్ కి సంబంధించిన బాయ్స్ హాస్టల్ నాలుగు అంతస్తులను కలిగి ఉంటుంది. నాలుగో అంతస్తుకి చెందిన రూమ్ నెంబర్ 418 వైపు వెళ్లొద్దని వార్డెన్ అందరినీ హెచ్చరిస్తూ ఉంటాడు. ఆ మెడికల్ కాలేజ్ లోనే చేరతాడు వివేక్ (సూర్య రాజ్). ఎన్నో రకాల జాగ్రత్తలు చెప్పిమరీ పేరెంట్స్ అతనిని ఆ కాలేజ్ లో జాయిన్ చేసి వెళతారు. సాధారణంగా హాస్టల్ బిల్డింగ్స్ లోకి మందు .. సిగరెట్టు వంటివి తీసుకురాకూడదనే నిబంధనలు కనిపిస్తూ ఉంటాయి. ఈ హాస్టల్లో మాత్రం అమ్మాయిలను ఎలాంటి పరిస్థితులలో తీసుకురాకూడదనే ఒక నిబంధన ఉంటుంది. అమ్మాయిలను ఆ హాస్టల్ గేటు దాటి లోపలి రాకూడదని చెప్పడానికీ .. 418 రూమ్ వైపుకు వెళ్లకూడదనే హెచ్చరించడానికి వెనుక ఏదో బలమైన కారణం ఉందని వివేక్ భావిస్తాడు. ఆ రూమ్ లో ఏదో జరిగిందనే అనుమానం అతనిలో పెరుగుతూ పోతుంది.ఆ రూమ్ పై దృష్టి పెట్టిన దగ్గర నుంచి వివేక్ కి భయంకరమైన అనుభవాలు ఎదురవుతూ ఉంటాయి. దాంతో అతను ఆ రూమ్ కి దూరంగా ఉంటూ, రహస్యంగా పరిశోధన చేయడం మొదలుపెడతాడు. ‘దేవిక’ అనే ప్రేతాత్మ ఆ రూమ్ లో ఉందనీ .. ఆ రూమ్ లోకి అడుగుపెట్టినవారిని అది బలి తీసుకుంటుందని వివేక్ తెలుసుకుంటాడు. అదే సమయంలో తన ఫ్రెండ్స్ తో ఛాలెంజ్ చేసి, బాయ్స్ హాస్టల్ లోకి అడుగుపెడుతుంది సాయేషా (ప్రీతీ పగడాల). అప్పుడు ఏం జరుగుతుంది? దేవిక ఎవరు? ఆమె నేపథ్యం ఏమిటి? ఎందుకు ఆమె ప్రేతాత్మగా మారింది? అనేది మిగతా కథ.హారర్ కథలలో ఒక లక్షణం కనిపిస్తూ ఉంటుంది. అవి ఒక పాడుబడిన బంగ్లాకి .. తోట బంగళాకి పరిమితమవుతూ ఉంటాయి. ఒక రకంగా దీనికి కారణం బడ్జెట్ అనే అనుకోవలసి ఉంటుంది. పాత్రలు ఆ బంగళాను వెతుక్కుంటూ వెళతాయే తప్ప, ఆ బంగాళా గేటు దాటి మాత్రం కథ బయటికి రాదు. ప్రేతాత్మలు ఎంత శక్తిమంతమైనప్పటికీ, ఆ శక్తులు ఆ నాలుగు గోడల మధ్యన మాత్రమే పనిచేస్తూ ఉంటాయి. అదే పద్ధతిని అనుసరిస్తూ వచ్చిన సినిమానే ‘418’. దెయ్యం సినిమాలకు వెళుతున్న ప్రేక్షకులకు .. ఆ సినిమాలో దెయ్యం ఉంటుందనే విషయం ముందుగానే తెలుసు. అయితే ఆ దెయ్యం అక్కడ ఎందుకు ఉంది? దెయ్యంలా ఎందుకు మారింది? అనేదే ఆడియన్స్ లో కుతూహలాన్ని రేకెత్తించే అంశాలుగా కనిపిస్తాయి. ఆ విషయాలను కనుక్కోవడానికి వివేక్ చేసే ప్రయత్నాలతో ఈ సినిమా ఫస్టాఫ్ నడుస్తుంది. దేవిక జీవితం ఎలాంటిది? ఆమె ఏ కారణంగా చనిపోయి ప్రేతాత్మగా మారింది? అనేది సెకండాఫ్ లో తెలుస్తుంది. తల్లిదండ్రులు గారంగా పెంచడం వలన సహజంగానే వివేక్ పిరికివాడిగా తయారవుతాడు. కొత్త ప్రదేశాలు అతనికి అనేక రకాల అనుమానాలు సందేహాలు కలిగిస్తూ ఉంటాయి. అందునా ఆ కాలేజ్ హాస్టల్ గురించిన మాటలు అతన్ని మరింతగా భయపడుతూ ఉంటాయి. అలాంటివాడు నేరుగా వచ్చి, ప్రేతాత్మ ఉన్న రూమ్ పక్కనే దిగడం ఆడియన్స్ లో ఆసక్తిని రేపుతోంది. ‘ఇక ఇక్కడి నుంచి మొదలవుతుంది అసలు కథ’ అన్నట్టుగా ఆడియన్స్ ప్రిపేర్ అవుతారు. మెడికల్ కాలేజ్ లోకి వివేక్ అడుగుపెట్టిన దగ్గర నుంచి, ఇంటర్వెల్ వరకూ కూడా దర్శకుడు అప్పుడప్పుడూ భయపెడుతూ వెళ్లాడు. ఇంటర్వెల్ తరువాత నుంచి మాత్రమే అసలు కథ మొదలవుతుంది. ప్రేతాత్మగా మారిన దేవికకి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ ఆసక్తికరంగా మారుతుంది. ప్రేతాత్మ రూమ్ లోకి సాయేషా వెళ్లడానికి చేసే ప్రయత్నంతో కథ క్లైమాక్స్ దిశగా పరిగెడుతుంది. చివరి అరగంట మాత్రం కాస్త భయపెడుతుంది. ప్రేతాత్మగా మారడం .. ప్రతీకారం తీర్చుకోవడం వంటి కథలతో గతంలో చాలానే సినిమాలు తెరపైకి వచ్చాయి. అయితే దర్శకుడు ఈ కథను ‘యక్షగానం’తో ముడిపెట్టి కాస్త కొత్తదనం తీసుకురావడానికి ప్రయత్నించాడు. అలాగే ఒక మూఢనమ్మకం ఎంత బలంగా ప్రభావితం చేస్తుందనేది చూపించాడు. అదే పనిగా అవమానిస్తూ వెళితే ఒక మనిషి స్వభావం ఎంత రాక్షసంగా మారిపోతుందనేది దర్శకుడు ఆవిష్కరించిన తీరు కూడా ఆలోచింపజేస్తుంది. హారర్ థ్రిల్లర్ సినిమాకి వచ్చిన ప్రేక్షకులను భయపెట్టేవి ఒకటి కెమెరా పనితనం .. రెండోది సౌండ్ ఎఫెక్ట్స్ అని చెప్పాలి. ఆ రెండు అంశాలు ఈ సినిమా విషయంలో కాస్త బలంగానే కనిపిస్తాయి. ఎడిటింగ్ ఫరవాలేదు. చైత్ర జె ఆచార్ తో పాటు మిగతా ఆర్టిస్టులంతా బాగానే చేశారు. ఈ సినిమా కథాకథనాలు అంత బలంగా ఏమీ కనిపించవు. కాకపోతే ఒక హారర్ సినిమాకి సంబంధించిన లక్షణాలు అక్కడక్కడా బలంగా కనిపిస్తాయంతే. దేవిక పాత్రలో చైత్ర ఆచార్ నటన మెప్పిస్తుంది. సినిమా మొత్తంలో ఆడియన్స్ ను ఆకట్టుకునేది దేవిక ఫ్లాష్ బ్యాక్ మాత్రమే. మిగతా కథంతా రొటీన్ కి భిన్నంగా ఏమీ అనిపించదు. ఆల్రెడీ చూసేసిన సన్నివేశాలని మళ్లీ చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతానికి సంబంధించిన ప్రతిభనే ఆడియన్స్ ను అలా కూర్చోబెడుతుంది. జోనర్ కి తగినట్టుగా కాస్త భయపెడుతుంది.

## ప్రత్యేక శక్తులున్న స్త్రీ కథ



జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్ లీడ్‌రోల్స్ చేసిన థ్రిల్లర్ మూవీ ‘కిల్లర్’. పూర్వాజ్ స్వీయ దర్శకత్వంలో ఎ.పద్మనాభరెడ్డితో కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈనెల 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు హరీష్‌శంకర్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ‘జ్యోతి పూర్వాజ్ ఇందులో విభిన్నమైన పాత్రల్లో కనిపిస్తారు. ప్రత్యేక శక్తులున్న మహిళగా ఇందులో ఆమె పాత్ర సాగుతుంది. ఆమె ఎవరు? అంటూ సాగే పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆసక్తికరంగా ఉంటుంది.ఎ2024, 25, 26.. ఈ మూడేళ్ల నేపథ్యంతో మూడు డిఫరెంట్ లేయర్లతో కథ సాగుతుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ సినిమాకు హైలైట్. ఇలాంటి సినిమా ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్‌పై రాలేదు’ అని దర్శకనిర్మాత, నటుడు పూర్వాజ్ తెలిపారు. ఇలాంటి వినూత్నమైన సినిమాను తీసిన పూర్వాజ్‌ను చూస్తుంటే గర్వంగా ఉందని జ్యోతిపూర్వాజ్ అన్నారు. ఇంకా మరో నిర్మాత పద్మనాభరెడ్డి, నటుడు గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి, డీవోపీ జగదీశ్ బొమ్మిశెట్టి, ఎడిటర్ బి.మనోజ్‌కుమార్ కూడా మాట్లాడారు.

## ప్రేమ, సైన్స్‌ఫిక్షన్ మేళవింపుగా..



రవి శివతేజ, భాస్కర్ పరమాత్మని, సుబ్రహ్మణ్యం అల, నేహా పఠాన్ ప్రధాన పాత్రధారులుగా శశాంక్ దువ్వూరు దర్శకత్వంలో డాక్టర్ దామోదర్ నేరేళ్ల నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో లాంఛనంగా మొదలైంది. ప్రేమ, స్నేహం, కుటుంబ అనుబంధాలు, సైన్స్ ఫిక్షన్ అంశాల మేళవింపుగా ఈ సినిమా రూపొందుతున్నదని, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ని ప్రారంభించి, వచ్చే ఏడాది థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాణం: డీఆర్‌ఆర్ ప్రొడక్షన్స్.

## ఆ క్రెడిట్ ప్రభాస్‌కే సొంతం



అలుపులేకుండా భారీ పాన్ ఇండియా సినిమాలు చేస్తూ అభిమానులకు అంతులేనంత సంతోషాన్నిస్తున్నారు అగ్ర కథానాయకుడు ప్రభాస్. 24ఏండ్ల క్రితం ‘ఈశ్వర్’తో మొదలైన ఆయన సినీ ప్రయాణం దేశం గర్వపడే బాక్సాఫీస్ రికార్డులతో అప్రతిహతంగా సాగుతున్నది. ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, చరిష్మాను ఇష్టపడేవారు నార్త్‌లో కోకొల్లలు. తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ స్థానిక స్టార్ హీరోల సినిమాలతో ప్రభాస్ సినిమాలు పోటీ పడుతున్నాయి. దీన్నిబట్టి హీరోగా ఆయన ఇమేజ్ ఈ స్థాయికి చేరుకుందో అర్థం చేసుకోవచ్చు. ప్రభాస్ నటించిన బాహుబలి–ది కంక్లూజన్, కల్కి 2898ఏడీ చిత్రాలు వెయ్యికోట్లకు పైగా వసూళ్లు సాధించాయి. వెయ్యికోట్ల పైచిలుకు వసూళ్లు సాధించిన రెండు సినిమాలున్న ఏకైక దక్షిణాది హీరో ప్రభాస్ మాత్రమే. ప్రస్తుతం ఆయన ఫౌజీ, స్పిరిట్, కల్కి 2 చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. పాన్ ఇండియా ఎల్లలు దాటి, గ్లోబల్ స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించేందుకు ఆ సినిమాలు సిద్ధమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు ఈ సినిమాల కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. వీటిలో ‘ఫౌజీ’ వచ్చే ఏడాది మార్చిలో విడుదల కానున్నట్టు వినికిడి. నేడు ప్రభాస్ పుట్టిన రోజు. ఆయన అభిమానులకు నిజంగా ఇది పండుగ రోజే.

## ‘రామాయణ’ ముందు భారీ సవాల్..

### బ్రేక్ ఈవెన్ టార్గెట్ ఎంతో తెలుసా?



భారత సినీ పరిశ్రమలో అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం ‘రామాయణ: పార్ట్ 1’. నితీశ్ తివారీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ. 2000 కోట్లుగా ప్రచారంలో ఉంది. ఈ స్థాయిలో భారీ పెట్టుబడి పెట్టినప్పుడు, సినిమా లాభాల బాట పట్టడం అంత సులభం కాదు. ట్రేడ్ విశ్లేషకుల అంచనాలను ఉటంకిస్తూ ఇండియా టుడే కథనం ప్రకారం.. ఈ సినిమా పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టి లాభాల్లోకి వెళ్లాలంటే ప్రపంచవ్యాప్తంగా కనీసం రూ. 5000 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించాల్సి ఉంటుంది. సాధారణంగా బడ్జెట్‌కు 2.5 రెట్ల వసూళ్లు వస్తేనే సినిమాను విజయవంతమైనదిగా పరిగణిస్తారు.

ఈ భారీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే సినిమాకు ఆకాశమంత ఓపెనింగ్స్ అవసరమని ట్రేడ్ నిపుణుడు రమేశ్ బాల అభిప్రాయపడ్డారు. దేశీయంగా అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ. 75 కోట్ల నుంచి రూ. 100 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా ప్రీ–సేల్స్ ద్వారా రూ. 150 కోట్ల నుంచి రూ. 200 కోట్లు వసూలు చేయడం ఆరంభానికి ఎంతో కీలకమని ఆయన విశ్లేషించారు. ఇక, తొలిరోజు భారత్‌లో రూ. 100–125 కోట్ల నెట్ కలెక్షన్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 175–200 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధిస్తే, సినిమాకు బలమైన పునాది పడుతుందని భావిస్తున్నారు. దేశీయ వసూళ్లలో దక్షిణాది మార్కెట్ల నుంచి 35–40 శాతం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అక్టోబర్ 22 నాటికి పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉన్న షోల కోసం జరిగిన అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా సుమారు 1.33 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా రూ. 7.52 కోట్లు సమకూరాయి. అయితే, భారీ బడ్జెట్ చిత్రం కావడంతో కేవలం ఓపెనింగ్స్ మీదే ఆధారపడలేరు. సినిమాకు మంచి మౌత్ టాక్ వస్తేనే లాంగ్ రన్‌లో నిలదొక్కుకోగలదు. కేవలం థియేట్రికల్ వసూళ్లే కాకుండా, శాటిలైట్, డిజిటల్, ఇతర హక్కుల అమ్మకాల ద్వారా కూడా నిర్మాతలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరనుంది. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని యశ్ నిర్మాణ సంస్థ మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, నమిత్ మల్హోత్రాకు చెందిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను నవంబర్ 5న దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుండగా, నవంబర్ 4న ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు.

## భజ గోవిందం బ్రతుకే కోలాహలం



హీరో కిరణ్ అబ్బవరం స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం ‘రియాలిటీ’. దేవిక భట్ కథానాయిక. సుధాకర్ చాగంటి దర్శకుడు. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా సంగీత ప్రయాణాన్ని మేకర్స్ ప్రారంభించారు.

ఈ సినిమాలోని తొలిపాట ‘భజ గోవిందం..’ను గురువారం విడుదల చేశారు. ‘భజగోవిందం.. భజగోవిందం.. బ్రతుకే కోలాహలం.. భజగోవిందం.. భజగోవిందం.. బరువే కాదే క్షణం..’ అంటూ భక్తిభావంతో కథకు అద్దంపట్టేలా ఈ పాట సాగింది. సనారే రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచగా, వైకోమ్ విజయలక్ష్మి ఆలపించారు. పనిని ప్రేమించడం, స్వశక్తితో ఎదగడం ఎంత ముఖ్యమో ఈ పాట చెబుతున్నది. పాటకు తగ్గట్టుగా విజువల్స్ కూడా సాగాయి. హోటల్ నడుపుతూ, కుటుంబ సభ్యులతో విలువైన క్షణాలను గడుపుతున్న హీరోగా కిరణ్ అబ్బవరాన్ని ఈ పాటలో చూడొచ్చు. శరత్‌కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ, సుదర్శనం తదితరులు ఇతరపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విశ్వాస్ డేనియల్, సహనిర్మాత: సురేశ్ యెర్రా, నిర్మాణం: జాయ్ ఫిల్మ్స్.

## శ్రీకార్తిక్ దర్శకత్వంలో రుక్మిణి వసంత్ క్రేజీ రోడ్ ట్రిప్ చిత్రం..




టాలీవుడ్, కోలీవుడ్ వర్గాల్లో ప్రస్తుతం ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తోన్న ఒక క్రేజీ రోడ్ ట్రిప్ కామెడీ డ్రామా చిత్రంలో టాలెంటెడ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ భాగమయ్యారు. యువ దర్శకుడు శ్రీకార్తిక్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె ‘తార’ అనే వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ పాత్రకు సంబంధించిన ప్రత్యేక పరిచయ వీడియోను తాజాగా చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ ఫన్నీ ప్రోమోలో దర్శకుడు శ్రీకార్తిక్ చాలా వినోదాత్మక రీతిలో కథను వివరించడం, ఆ నరేషన్ నచ్చడంతో రుక్మిణి ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా వెంటనే ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చూపించారు. ఈ ప్రమోషనల్ వీడియో ప్రస్తుతం సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటూ వైరల్ అవుతోంది. ఈ వినోదాత్మక రోడ్ ట్రిప్ చిత్రంలో దేవ్ రామ్‌నాథ్, వినయ్ వంటి ప్రముఖ నటులు కూడా ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడికానుండగా, చిత్ర యూనిట్ త్వరలోనే అధికారిక టైటిల్‌ను కూడా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తోంది.

# ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి

**ఎల్ నీ నో పై అప్రమత్తంగా ఉండాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) జిల్లా రైతాంగం ఆరుతడి పంటల సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.శుక్రవారం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. పంట పొలాలు ఎండి పోకుండా జాగ్రత్తలుపాటించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్ నీ నో పై అప్రమత్తంగా ఉండాలని,జిల్లా రైతాంగం వచ్చే రబి సీజన్ కోసం ఆరుతడి పంటల వైపు దృష్టిసారించి, నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.ఎల్ నీ నో ప్రభావం వల్ల ఎండుతున్న పంటలనుకాపాడుకోవాలన్నారు . ప్రత్యామ్నాయ పంటలైన కుసుమ, ఆయిల్ ఫామ్ మొదలగు పంటలకు ప్రభుత్వం సబ్సిడీతోపాటు, అనేక పథకాల ద్వారా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ వేయడం ద్వారా అంతర పంటల తో అధికఆదాయంలభిస్తుందన్నారు. ఎల్ నీ నో ప్రభావం పై అప్రమత్తత కోసం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యాన వన శాఖ అధికారి ప్రతాప్ సింగ్,వ్యవసాయ , ఉద్యానవన శాఖ అధికారులు ప్యాట చిన్న చింతకుంట సర్పంచ్ సరిత మహేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెరగాల్సిన వేతనాలు తగ్గడమేంటి
# ఎన్ఎచ్ఎం ఉద్యోగుల విచిత్ర పరిస్థితి

**ఎన్ఎచ్ఎం ఉద్యోగుల ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ - రహీం**

**-ఎన్ఎచ్ఎం ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వం**

**- ?ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖం చాటేసిన వైనం.**

**- ?ఆత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి వైద్య సేవలందించిన ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలవాలి.**

**- ఎన్ఎచ్ఎం ఉద్యోగుల వేతనాల్లో 4 - 5 వేల వరకు కోతలు**

**-1195 జిఓ తో ఎన్ఎచ్ఎం ఉద్యోగుల్లో కొందరికి మోధం మరికొందరికి ఖేధం**

**- అపరిష్కృత సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కిన ఉద్యోగులు. పది రోజులుగా సాగుతున్న ఆందోళనలు.**

**- తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలని,ఉద్యోగులపై వివక్ష చూపడం ప్రభుత్వానికి తగదని తెలంగాణ ఎన్ఎచ్ఎం ఉద్యోగుల ఫెడరేషన్ జాయింట్ జనరల్ సెక్రటరీ మహ్మద్ రహీం తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖలో ఎన్ఎచ్ఎం విభాగం క్రింద పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగుల వేతనాల్లో పారదర్శకత లోపించడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకువచ్చిన 1195 జిఓ వల్ల ఉద్యోగుల్లో కొందరికి మోధం, మరికొందరికి ఖేదంగా మారిందని అన్నారు. ఉద్యోగుల వేతనాలను పెంచాల్సి ఉండగా తగ్గించడమేంటని మండిపడ్డారు. 1195 జిఓ తో పలు క్యాడర్ల ఉద్యోగుల వేతనాల్లో 4 - 5 వేల వరకు తగ్గించారని, దీంతో ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఒకవైపు ద్రవ్యోల్బణం పెరుగుతుండగా నానాటికి పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలతో సతమతమవుతుండగా ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధించడం దురదృష్టకరమని విమర్శించారు. ఎన్ఎచ్ఎం ఉద్యోగుల వేతనాల బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వమే భరిస్తున్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సమయానుకూలంగా వేతనాలు చెల్లించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇదిలావుండగా ప్రతి సంవత్సరం వేతనాలను 5 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికి, పెరగాల్సిన వేతనాల్లో కోతలతో తగ్గించడమేంటని నీలదీసారు. అనివార్య పరిస్థితుల్లో ప్రభుత్వానికి అండగా నిలిచి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి వైద్యసేవలందించిన మా ఎన్ఎచ్ఎం ఉద్యోగులపై వివక్ష చూపడం ప్రభుత్వానికి తగదని హితవు పలికారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు, అధికారంలోకి వచ్చాక ముఖం చాటేయడం నాయకుల రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని, తమ అపరిష్కృత సమస్యల సాధన కోసం పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎచ్ఎం ఉద్యోగులు విధులను బహిష్కరించి ఆందోళనలల్లో పాల్గొంటునప్పటికి కనీస స్పందన కరవైందని విమర్శిచారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేస్తు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న ఉద్యోగులను సమస్యల సుడిగుండంలోకి నెట్టి వివక్ష చూపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైన ఎన్ఎచ్ఎం ఉద్యోగుల అపరిస్కృత సమస్యలను పరిష్కరించి, 1195 జిఓ లో ఉన్న వేతనాల వ్యత్యాసాలను సవరించి తమకు అందాల్సిన వేతనాల్లో పెట్టిన కోతలను రద్దుచేసి, ఎన్ఎచ్ఎం ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన క్యూ.ఆర్.టీ సిబ్బంది

**ఏడుపాయల ఆలయంలో అప్రమత్తంగా వ్యవహరించిన మెదక్ పోలీసులు**




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి దర్శనానికి వచ్చి తప్పిపోయిన నాలుగేళ్ల బాలుడిని మెదక్ జిల్లా పోలీసుల క్యూ.ఆర్.టీ సిబ్బంది సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. బాన్సువాడకు చెందిన మోహన్, సంధ్య దంపతులు శుక్రవారం ఏడుపాయల అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈ క్రమంలో వారి నాలుగేళ్ల కుమారుడు మోక్షిత్ తప్పిపోయాడు.ఆలయ ప్రాంగణంలో బాలుడు ఒంటరిగా ఏడుస్తూ కనిపించడంతో అక్కడ విధుల్లో ఉన్న మెదక్ క్యూ.ఆర్.టీ సిబ్బంది వెంటనే స్పందించి బాలుడిని చేరదీశారు. అనంతరం బాలుడి వివరాలను తెలుసుకుని తల్లిదండ్రులను గుర్తించి, వారి చెంతకు చేర్చేందుకు చర్యలు తీసుకున్నారు. తమ కుమారుడు సురక్షితంగా తిరిగి దొరకడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.రద్దీ ప్రదేశాల్లో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టవద్దని సూచించారు. విధి నిర్వహణలోసమయస్ఫూర్తితో స్పందించి బాలుడికి భద్రత కల్పించిన క్యూ.ఆర్.టీ సిబ్బందిని అభినందించారు.

# శ్రీరాంశర్మ సేవలు అభినందనీయం



బడంగ్‌పేట్ (ప్రశ్న న్యూస్)దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆశ్వీయుజ మాస శుక్లపక్షం పాడ్యమి నుండి విజయదశమి వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆడంబరంగా జరుపుకున్న దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండప నిర్వహణ, సంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి అలంకరణ, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో బాధ్యతాయుతంగా నిర్వహించిన ప్రముఖ అర్చకులు, శ్రీ సాయిబాలాజీ హోమ్స్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీరాంశర్మను అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు సంయుక్తంగా ఘనంగా సత్కరించారు. దసరా, శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీరాం శర్మ చూపిన సేవాభావాన్ని కొనియాడారు. అలాగే ఇటీవల ముగిసిన గణేష్ నవరాత్రుల సందర్భంగా కూడా అత్యంత వైభవంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు, సంస్కృతిక కార్యక్రమాలను సైతం అత్యంత వైభవంగా ముందుండి నిర్వహించిన ఘనత శ్రీ రాం శర్మకే దక్కుతుందని పలువురు కాలనీవాసులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**నాగారంలో సెర్నిటీ మోడల్ స్కూల్ విద్యార్థులతో పోలీసుల అవగాహన ర్యాలీ**



కీసర( ప్రశ్న న్యూస్) పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని అక్టోబర్ 23న నాగారంలోని సెర్నిటీ మోడల్ స్కూల్ విద్యార్థులతో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కీసర సీఐ ఎలక్షన్ రెడ్డి, నాగారం ఎస్ఐ నాయకత్వంలో పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ నాగారం ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా సీఐ ఎలక్షన్ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలని, విద్యార్థులు క్రమశిక్షణతో, దేశభక్తితో మెలగాలని సూచించారు. ర్యాలీలో విద్యార్థులు "పోలీస్ అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెర్నిటీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాయిని జలాల్పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**క్వింటాలుకు ఏ-గ్రేడ్‌కు రూ.2,461..**

**సాధారణ రకానికి రూ.2,441**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిని జలాల్పూర్ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. గ్రామ దేవి సింగ్ అధ్యక్షతన గురువారం కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్చేసికేంద్రాన్నిప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు, కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ఏ–గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 చెల్లించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాల ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యంలో తేమ శాతం 17కు మించకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాయిని వెంకట నరసింహులు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు గంపల లక్ష్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్న రాయన్న, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి మౌనిక, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జులు గొల్ల పాండరి, చందర్ నాయక్, వార్డు సభ్యులు గంగ స్వామి, మధులత, కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, నాయకులు నాయిని విట్టల్, దాసు, నర్సింలు, ఏగొండతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఈరోజు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేత**



కీసర( ప్రశ్న న్యూస్) సబ్‌స్టేషన్ల నిర్వహణ పనుల కారణంగా ఈరోజు కీసర, ఘట్‌కేసర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఆయా ఫీడర్ల పరిధిలో నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కీసర విద్యుత్ శాఖ ఏఏఈ ఎస్. మురళీకృష్ణ తెలిపారు.

**విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు, సమయాల వివరాలు:**

**1. 11 కేవీ శ్రీనగర్ ఫీడర్ (రాంపల్లి సబ్‌స్టేషన్):**

ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంపల్లి ఇండస్ట్రియల్ ఏరియా, చెర్లపల్లి−−రాంపల్లి రోడ్డు, సాయినగర్ కాలనీ, జ్యోతి కాలనీ, డీఎస్ఆర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.

**2. 11 కేవీ యాద్గార్‌పల్లి ఫీడర్ (యాద్గార్‌పల్లి సబ్‌స్టేషన్):**

ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు యాద్గార్‌పల్లి గ్రామం, చిత్రమ్మ ఆలయం, టింబర్ డిపో, ఎస్సీ కాలనీ, రామస్వామి కాలనీ, యాద్గార్‌పల్లి ఏజీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదు.

**3. 11 కేవీ ఎస్ఎల్ఎన్ఎస్ ఫీడర్ (యాద్గార్‌పల్లి సబ్‌స్టేషన్):**

ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్ఎస్ఆర్ బృందావన్, గణేష్ టౌన్‌షిప్, ఎంఎల్ఆర్ కాలనీ, బాలాజీ ఎన్‌క్లేవ్, చీర్యాల గ్రామం, ఆర్కే నగర్, ఎన్ఎఫ్‌సీ కాలనీ, స్వరూప్ నగర్, రోజ్ గార్డెన్, శివసాయినగర్, ఈడెన్ గార్డెన్, మల్లన్న ఆలయం, ఎస్ఎల్ఎన్ఎస్ హోమ్స్, ఎస్ఎల్ ప్రైమ్, సాయినగర్ కాలనీ, విజ్ఞాన్ ఎన్‌క్లేవ్, సాయి కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

**4. 11 కేవీ యమ్నంపేట్ ఫీడర్ (ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్):**

ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు ఇస్మాయిల్‌ఖాన్‌గూడెం, సాయిగూడెం, యమ్నంపేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

# తెలంగాణ భవన్‌లో యువ నాయకుడు మహమ్మద్ అజర్‌కు కేటీఆర్ ప్రశంసలు

**గుడ్ అజర్.. కీప్ ఇట్ అప్, అంటూ అభినందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**200 మందికి పైగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో అజర్ కీలక కృషి**



అంబర్ పేట్ (ప్రశ్న న్యూస్)తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ యువ నాయకుడు మహమ్మద్ అజర్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి ప్రశంసలు లభించాయి. అంబర్‌పేట శాసనసభ్యులు కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు కాలేరు వెంకటేష్ యువ నాయకుడు మహమ్మద్ అజర్‌ను కేటీఆర్‌కు ప్రత్యేకంగా పరిచయం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో అజర్ చురుకుగా పాల్గొంటూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని వివరించారు. ముఖ్యంగా 200 మందికి పైగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో అజర్ కీలకంగా పనిచేశారని కేటీఆర్‌కు తెలియజేశారు.అజర్ పార్టీ కోసం చేస్తున్న కృషిని తెలుసుకున్న కేటీఆర్.. "గుడ్ అజర్.. కీప్ ఇట్ అప్!" అంటూ అభినందించారు. యువ నాయకులు పార్టీ కోసం అంకితభావంతో పనిచేయడం అభినందనీయమనే విధంగా అజర్ సేవలను ప్రశంసించడంతో అక్కడి నాయకుల్లో ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా మహమ్మద్ అజర్ ఆనందం వ్యక్తం చేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం భవిష్యత్తులోనూ మరింత ఉత్సాహంతో, నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. తనకు ఈ ప్రత్యేక అవకాశాన్ని కల్పించి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పరిచయం చేసిన అంబర్‌పేట శాసనసభ్యులు కాలేరు వెంకటేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పసి ప్రాణాలతో చెలగాటం

- దాదాపు పది రోజులుగా వ్యాక్సిన్ల ఇవ్వక చిన్నారుల ఆరోగ్యంపై నీలినీడలు
- నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నాతో స్తంభించిన వైద్య సేవలు
- గూగుల్‌లో, ప్రభుత్వ వెబ్‌సైట్లలో తప్పులతడకగా అధికారుల ఫోన్ నంబర్లు
- వైద్య ఆరోగ్య శాఖకు మంత్రి ఉన్నా.. క్షేత్రస్థాయిలో పాలన సున్నా

**( ఆర్ కె -- ప్రశ్న న్యూస్ బ్యూరో)**






పసిపిల్లల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారా.? చిన్నారులకు సకాలంలో అందాల్సిన టీకాల విషయంలో ఇంత నిర్లక్ష్యమా.? దాదాపు పది రోజులుగా వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారనే ఆరోపణలు వికారాబాద్ జిల్లాలో వైద్యశాఖ పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఒకవైపు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నాతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడిందనే విమర్శలు వినిపిస్తుండగా, మరోవైపు చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆరోగ్యశాఖ మంత్రి, కమిషనర్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన శాఖలోనే ఇలాంటి దుస్థితి నెలకొంటే సామాన్యులు ఎవరిని ఆశ్రయించాలి.?

### వ్యాక్సిన్లు ఎక్కడ.? బాధ్యత ఎవరిది.?

చిన్నారులకు వయస్సు, టీకా షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్లు అందించడం ప్రజారోగ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన బాధ్యత. టీకాలు అందుబాటులో లేకపోవడం లేదా సేవలకు అంతరాయం ఏర్పడటంతో తల్లిదండ్రులు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడడానికి బాధ్యులెవరు.? దాదాపు పది రోజులుగా వ్యాక్సిన్ల లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదన్న ఆరోపణలపై ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, జిల్లా వైద్యశాఖ అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. సిబ్బందితో సమస్య ఉంటే కారణాలేమిటి.? ఇతర సిబ్బందిని ఎందుకు సమకూర్చలేకపోయారు.? ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదు.? ఈ ప్రశ్నలకు ఆరోగ్యశాఖ కమిషనర్ సమాధానాలు చెప్పాలని ప్రతిపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నారు.టీకాల షెడ్యూల్‌పై తల్లిదండ్రులకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. టీకా అందుబాటులో లేకపోతే తదుపరి మోతాదు ఎప్పుడు వేయించుకోవాలి, ఎక్కడ అందుబాటులో ఉంది అనే వివరాలను వైద్య సిబ్బంది తెలియజేయాలి. కానీ అలాంటి కనీస సమాచారం లేకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన నెలకొన్నది. ఆలస్యమైన టీకాను ఎప్పుడు వేయించుకోవాలో వైద్యుల సలహా తీసుకోవాలి. చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన అంశంలో కొంచెం కూడా నిర్లక్ష్యానికి తావుండకూడదు. కానీ వికారాబాద్ జిల్లాలో తీవ్ర నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఉద్యోగుల ధర్నా.. ప్రజలకు తప్పని తిప్పలు

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల ధర్నా కారణంగా వైద్య సేవలు స్తంభించాయన్న విమర్శలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతే. అదే సమయంలో అత్యవసర వైద్య సేవలు, చిన్నారుల టీకాలు, గర్భిణులకు అందాల్సిన సేవలు నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉన్నత అధికారులదే. ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపడంలో జాప్యం జరిగితే దాని ప్రభావం చివరకు సామాన్య ప్రజలపై పడుతుంది. విధులు, సేవలు, బాధ్యతల మధ్య సమన్వయం సాధించడంలో వైద్యశాఖ యంత్రాంగం విఫలమైందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### గూగుల్‌లో తప్పు నంబర్లు.. ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ గందరగోళమేనా.?

వైద్య ఆరోగ్యశాఖ అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించే ప్రజలకు గూగుల్లో సరైన వివరాలు, ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడం మరో సమస్యగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐటీ రంగంలో దూసుకుపోతున్నాము అని చెప్పే ప్రభుత్వం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కనీస వివరాలు అధికారుల ఫోన్ నెంబర్లను గూగుల్లో ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. గూగుల్‌లో కనిపించే కొన్ని సంప్రదింపు వివరాలు, ప్రభుత్వ వెబ్‌సైట్లలో ప్రచురించిన అధికారుల ఫోన్ నంబర్లు తప్పుగా ఉన్నాయని ప్రజలు చెబుతున్నారు. కొన్ని నెంబర్లు అధికారులు అసలు ఫోనే ఎత్తరని మరి అలాంటప్పుడు ప్రభుత్వ అధికారుల ఫోన్ నెంబర్లు ఎందుకు వెబ్సైట్లో పెడుతున్నారు కమిషనర్లకే తెలియాలి. ఫలితంగా ఫిర్యాదు చేయాలన్నా, వ్యాక్సిన్ల లభ్యత తెలుసుకోవాలన్నా, వైద్య సేవలపై సమాచారం పొందాలన్నా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వ వెబ్‌సైట్లలో అధికారుల వివరాలు ప్రచురించడం మాత్రమే సరిపోదు. ఆ నంబర్లు పనిచేస్తున్నాయా.? సంబంధిత అధికారి అందుబాటులో ఉన్నారా.? బదిలీలు జరిగినప్పుడు వివరాలను అప్‌డేట్ చేస్తున్నారా.? ఉన్న అధికారులు ఫోన్ ఎందుకు ఎత్తడం లేదు.? ప్రజల ఫోన్లను అధికారులు ఎందుకు ఎత్తరు.? అనే అంశాలపై కమిషనర్, చీఫ్ సెక్రటరీల నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కానీ అలాంటి పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏ శాఖలో లేకపోవడం ప్రజల కర్మగా భావిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడని సంప్రదింపు వ్యవస్థ ఉన్నా, లేనట్టే కాదా.? డిజిటల్ పాలన పేరుతో వెబ్‌సైట్లు నిర్వహిస్తున్నప్పుడు వాటిలోని సమాచారం వాస్తవాలకు అనుగుణంగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

### మంత్రి ఉన్నా.. పాలన ఎక్కడ.?

ఆరోగ్యశాఖకు మంత్రి ఉన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్, ఉన్నతాధికారులున్నారు. ప్రతి జిల్లా స్థాయిలో యంత్రాంగం ఉంది. అయినా ప్రజలకు కనీస వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అన్న సమీక్ష ఎక్కడ ఉంది ప్రజల ఫిర్యాదులపై జవాబు దారి తనం ఒక్క అధికారికైనా ఉందా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాక్సిన్ల సరఫరా, ఉద్యోగుల సమస్యలు, ప్రజలకు సమాచారం అందించే వ్యవస్థలో లోపాలు ఒకేసారి వెలుగులోకి వస్తే అది సాధారణ సమస్యగా కొట్టిపారేయలేం. శాఖలో సమన్వయం కొరవడిందా.? క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారా.? ప్రజల ఇబ్బందులు ప్రభుత్వానికి చేరుతున్నాయా.? అన్నది తేలాల్సి ఉంది.

### తక్షణ చర్యలు తీసుకుంటారా.?

వికారాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారులు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల ధర్నాతో ఏర్పడిన సమస్యలపై వ్యాక్సిన్ల నిల్వలు, సరఫరా పరిస్థితిపై స్పష్టమైన ప్రకటన చేయాలి. పెండింగ్‌లో ఉన్న టీకాల పంపిణీకి కార్యాచరణ ప్రకటించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూనే ప్రజారోగ్య సేవలు నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి. గూగుల్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉన్న అధికారుల సంప్రదింపు వివరాలను పరిశీలించి సరిచేయాలి.

చిన్నారుల ఆరోగ్యం ప్రభుత్వానికి ప్రాధాన్యమా.? లేక అధికారుల నిర్లక్ష్యానికి బలికావాల్సిందేనా.? వికారాబాద్ జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ప్రజారోగ్యం విషయంలో జాప్యానికి తావులేదు. పసిపిల్లల టీకాల విషయంలో ప్రతి రోజు విలువైనదే, బాధ్యత వహించాల్సిన ఉన్నత అధికారులు ఇకనైనా మేల్కొంటారా.?

# మంచి రోడ్డును తవ్వి వదిలేశారు

- 22 రోజులైనా ముందుకు కదలని సీసీ రోడ్డు పనులు - బతుకమ్మ, దసరా పండుగల వేళ విజయపురి కాలనీ వాసులకు నరకయాతన
- డ్రైనేజీ పైపులైన్ ధ్వంసం.. మూడు వారాలుగా దుర్గంధం.. అయిన స్పందించని ఇంజనీరింగ్ అధికారులు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా.. అధికారుల అలసత్వమా.? - డిప్యూటీ, జోనల్ కమిషనర్లకు ప్రజల సమస్యలు పట్టవా.?




**తార్నాక (ప్రశ్న న్యూస్)** ప్రజలకు మెరుగైన రహదారులు కల్పించాల్సిన అధికారులు.. ఉన్న మంచి రోడ్డును తవ్వి వదిలేస్తే ప్రజల పరిస్థితి ఏమిటి.? పది రోజుల్లో పూర్తికావాల్సిన సీసీ రోడ్డు పనులు 22 రోజులు గడుస్తున్నా ముందుకు కదలకపోవడం అధికారుల బాధ్యతారహిత్య పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది. మెట్టుగూడ సర్కిల్ పరిధిలోని తార్నాక విజయపురి కాలనీలో రోడ్డు పనుల పేరుతో స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పనులు నత్తనడక.. ప్రజలకు కష్టాల వాత

రోడ్డును తవ్విన కాంట్రాక్టర్ పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బతుకమ్మ, దసరా పండుగల సమయంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగల వేళ ఇళ్లకు బంధువులు, అతిథులు వచ్చే సమయంలో రహదారి దుస్థితి కారణంగా అవస్థలు పడాల్సి వచ్చిందని వాపోతున్నారు. రోడ్డును తవ్వినప్పుడు చూపిన హడావుడి.. పనులు పూర్తి చేయడంలో మాత్రం కనిపించడం లేదని మండిపడుతున్నారు.

### డ్రైనేజీ పైపులైన్ పగులు.. దుర్గంధంతో సతమతం

రోడ్డు తవ్వకాల సమయంలో డ్రైనేజీ పైపులైన్ దెబ్బతినడంతో మూడు వారాలు గడిచిపోతున్న మురుగునీటి సమస్య, తీవ్రమైన దుర్గంధం నెలకొన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దుర్వాసనతో పరిసరాల్లో నివసించలేని పరిస్థితి ఏర్పడినా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### ప్రజల కష్టాలు పట్టించుకోరా.?

పనుల్లో జాప్యంపై స్థానికులు ప్రశ్నిస్తున్నా అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులు సైతం ప్రజల సమస్యపై దృష్టి సారించడం లేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించి, కాంట్రాక్టర్‌కు స్పష్టమైన గడువు విధించాల్సిన అధికారులు మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నారా.?

సీసీ రోడ్ల నిర్మాణంలో జాప్యం, నాణ్యతపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్ల పనితీరును పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్ విభాగం ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో విజయపురి కాలనీలో వేసిన సిసి రోడ్డు లు నాణ్యత లోపంతో పాటు తూతూ మంత్రంగా పనులు ముగించుకొని కాంట్రాక్టర్లు అధికారులకు లంచాల చూపుతున్నారన్న విమర్శలు జోరుగా ఉన్నాయి. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య ఏవైనా అంతర్గత అవగాహనలు ఉన్నాయా.? అందుకోసమే వర్క్ ఆర్డర్ కు విరుద్ధంగా పనులు చేశారన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారా.?

ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు ఉపశమనం కలిగించాలి కానీ శాపంగా మారకూడదు. రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం, డ్రైనేజీ సమస్యను పరిష్కరించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

తార్నాక విజయపురి కాలనీలో రహదారి పనుల నాణ్యతపై తనిఖీలు నిర్వహించి, దెబ్బతిన్న డ్రైనేజీ పైపులైన్‌ను తక్షణమే మరమ్మతు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా మెట్టుగూడ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు స్పందిస్తారా.? లేక ప్రజల ఇబ్బందులను ఇలాగే గాలికి వదిలేస్తారా.? అన్నది వేచి చూడాల్సిందే.

# జనవాసాల మధ్య అక్రమ బ్లాస్టింగ్‌లు

- ప్రాణాలు అరచేతిలో స్థానికులు - కఠిన చర్యలకు స్థానికుల డిమాండ్





**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్ పట్టణంలో జనవాసాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న భారీ బ్లాస్టింగ్‌లు స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ప్లాట్లు, బండరాళ్లను పగులగొట్టేందుకు కాంట్రాక్టర్లు జేసీబీలు, ట్రాక్టర్లతో పాటు రక్షణ ఏర్పాట్లు లేకుండా విచ్చలవిడిగా పేలుడు పదార్థాలను వాడుతున్నారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు అతి సమీపంలోనే ఈ పనులు సాగుతుండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. భూమి కంపించేలా జరుగుతున్న పేలుళ్ల ధాటికి సమీపంలోని ఇళ్ల గోడలు, పైకప్పులు నెర్రలు చాచి ప్రమాదకరంగా మారుతున్నాయి. మరోవైపు ఆకస్మిక విస్ఫోటనాల శబ్దానికి చిన్నారులు, వృద్ధులు తీవ్ర భయాందోళనలకు లోనవుతుండగా, వినికిడి లోపం, గుండె సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పేలుళ్ల వల్ల వెలువడే భారీ దుమ్ము, పొగతో స్థానికులు శ్వాసకోశ, కంటి సమస్యలతో అల్లాడిపోతున్నారు.

### అధికారుల మౌనం.. చర్యలకు స్థానికుల డిమాండ్

మైనింగ్ నిబంధనల ప్రకారం జనవాసాలకు దూరంగా రక్షణ ఏర్పాట్లతో బ్లాస్టింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ అన్ని నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి అక్రమ బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, పేలుళ్లను శాశ్వతంగా అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా జనసేన జెడ్పీటీసీ అభ్యర్థి

# కోట రాకేష్ నామినేషన్

- భారీ బైక్ ర్యాలీతో హోరెత్తిన నందిగామ




నందిగామ (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల సందడి నందిగామ నియోజకవర్గంలో ఊపందుకుంది. వీరులపాడు జెడ్పీటీసీ స్థానానికి జనసేన పార్టీ అధికారిక అభ్యర్థిగా కోట రాకేష్ (ఆర్కే) గురువారం తన నామినేషన్ పత్రాన్ని ఘనంగా దాఖలు చేశారు.వీరులపాడు మండల పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా నందిగామ పట్టణంలో జనసేన శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జనసేన నినాదాలతో హోరెత్తించారు.నామినేషన్ అనంతరం అభ్యర్థి కోట రాకేష్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో భారీ మెజారిటీతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గెలిచిన తర్వాత గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కండి

- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించనున్న చర్చలకు సర్వసన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే పరమావధిగా ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా తుమ్మిడిహట్టి, దిండి, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలపై చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ఎల్లంపల్లి వరకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని, అయితే దీనివల్ల సుమారు 2,300 ఎకరాల మేర ముంపునకు గురవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే 150 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే ముంపు వెయ్యి ఎకరాల లోపే మాత్రమే ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం, మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేస్తూనే, తెలంగాణకు గరిష్ఠంగా నీటి లభ్యత ఉండేలా బ్యారేజీ డిజైన్‌ను రూపొందించాలని సూచించారు.అక్టోబర్ 23 తర్వాత చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి సంకేతాలిచ్చారని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఇటీవల కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన సమావేశ వివరాలతో పాటు, సీడబ్ల్యూసీ కోరే ఎలాంటి సమాచారానికైనా సిద్ధంగా ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దిండి ప్రాజెక్టుకు సంబంధించి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని తీసుకునేందుకు, శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, డి. శ్రీధర్ బాబు, సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588